# ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం వార్త

ఆదివారం 09, ఆగస్టు 2026 | 16 పేజీలు





## ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణం పెంచాలి

**నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ అంకిత్**

16వ పేజీలో...

కొత్తగూడెం, ఆగస్టు 8 ప్రభాతవార్త






# గోదారి ఒడ్డు.. మృతదేహాల మిస్టరీ

## రెండ్రోజులు.. రెండు శవాలు.. ఏమిటా మర్మం?



**గోదావరిలో కొట్టుకొస్తున్న శవాలు.. ఆందోళన!**

**ఒకటి గుర్తింపు.. మరొకటి అంతుచిక్కదు!**

**గోదావరి ఒడ్డున వరుస విషాదాలు.. కారణమేంటి?**

**శవాల్ని మోసుకొస్తున్న గోదావరి!**

**గోదావరి ప్రవాహంలో మృత్యు మిస్టరీ!**

**ఎగువ నుంచి వస్తున్నాయా? గోదావరి ఒడ్డున శవాల కలకలం!**

**మిస్సింగ్ కేసులతో లింక్‌పై పోలీసుల ఆరా**

2వ పేజీలో...

భద్రాచలం,ఆగస్టు 8 (ప్రభాతవార్త): గోదావరి తీరం వరుసగా గుర్తుతెలియని మృతదేహాలకు వేదికగా మారడం ఆందోళన కలిగిస్తోంది. భద్రాచలం పరిధిలో శుక్రవారం, శనివారం రెండు రోజుల వ్యవధిలో ఇరువైపులా గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలు లభించడం పలు అనుమానాలకు తావిస్తోంది. శుక్రవారం లభించిన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించడంతో అది ఆంధ్రప్రదేశ్‌లోని తిరువూరుకు చెందిన వ్యక్తిదిగా తేలినట్లు సమాచారం. అయితే శనివారం సారపాక వైపు గోదావరి బ్రిడ్జి సమీపంలో లభించిన మరో మృతదేహం ఎవరిదనే విషయం ఇంకా తెలియరాలేదు. దీంతో ఈ రెండు ఘటనలపై పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

**-బ్రిడ్జి వద్ద మృతదేహం:**

భద్రాచలం గోదావరి బ్రిడ్జి సారపాక వైపు మూడో నంబర్ పిల్లర్ సమీపంలో శనివారం గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభించింది. సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. మృతుడు బూడిద రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్టు, నీలిరంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించేందుకు కుటుంబ సభ్యులు, బంధువుల ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.




2వ పేజీలో...

**35 మంది జూనియర్ లెక్చరర్ల గుట్టు రట్టు**

**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నలుగురు గుర్తింపు**

**షోకాజ్ నోటీసులు జారీ చేసిన ఇంటర్ బోర్డు**

**35 కాదు 600 మంది ఉన్నారంటున్న అర్హత కలిగిన జూనియర్ లెక్చరర్లు**

### తెలంగాణలో ఫేక్ సర్టిఫికెట్లతో..

# లెక్చరర్లుగా చలామణి

మధిర, ప్రభాతవార్త : ఎంతోకాలంగా తమకు అన్యాయం జరిగిందంటూ ఉమ్మడి రాష్ట్రంలో జూనియర్ లెక్చరర్లుగా విధుల్లో చేరిన అన్ని అర్హతలు కలిగిన లెక్చరర్లు ప్రభుత్వాలకు కోర్టులకు తమ గోడు గడిచిన పదేళ్లుగా వినిపిస్తూనే ఉన్నారు. గత పాలకులు ఈ అంశాన్ని అసలు పట్టించుకోకపోగా, రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రజా ప్రభుత్వం లోనైనా తమకు న్యాయం జరుగుతుందంటూ ప్రస్తుతం ప్రభుత్వ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్లుగా విధులు నిర్వహిస్తూ రెగ్యులరైజేషన్కు అన్ని అర్హతలు ఉండి అన్యాయం అయిపోయిన అధ్యాపకులు తమ ఆవేదనలను కలిసిన మంత్రులకు ముఖ్యమంత్రి కి విన్నత్తులు చేస్తూనే ఉన్నారు. వీరి గోడు కు కొంతమేర ఊరట లభించేలా ఎట్టకేలకు విద్యాశాఖ రెగ్యులరైజేషన్ పొంది విధులు నిర్వహిస్తూ వస్తున్న జూనియర్ లెక్చరర్ల అర్హతల పై దృష్టి సారించింది.

# అత్తను హత్య చేసి కాల్చి బూడిద చేసిన అల్లుడు



**తుంబూరు గ్రామంలో దారుణ సంఘటన**

సత్తుపల్లి ఆగస్టు 8 ప్రభాతవార్త

పిల్లనిచ్చిన అత్తను, అల్లుడు దారుణంగా హత్య చేసి రెండో కంటికి తెలవకుండా మాయ చేద్దామని రాత్రికి రాత్రే మరొకరి సహాయంతో బస్తాలో బాడీని మూటగట్టి సమీపంలోని పామా యిల్ తోటల్లో శవాన్ని కాల్చి బూడిద చేసిన దారుణమైన సంఘటన సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామంలో వెలుగు చూసింది. సభ్య సమాజం తలవంచుకునే విధంగా జరిగిన ఈ దారుణ మైన సంఘటన గురించి గ్రామ స్తులు కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం తుంబూరు గ్రామానికి చెందిన వెదుళ్ళ గుండాల వెంకట నరసమ్మ (65) కు ముగ్గురు కుమార్తెలు సంతానం.

2వ పేజీలో...



# ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

-హక్కులు, అస్తిత్వం, సంస్కృతి పరిరక్షణకు ఐక్యంగా కదలాలి

-ఆగస్టు 9న భద్రాచలంలో ర్యాలీ.. సాంస్కృతిక కార్యక్రమాలు

9వ పేజీలో...

## గోదావరి ఒడ్డు.. మృతదేహాల మిస్టరీ!

మొదటి పేజీ తరువాయి..

**-వైకుంఠధామం వద్ద మరో శవం:**

ఇదే సమయంలో భద్రాచలం గోదావరి ప్రవాహంలో కొట్టుకొచ్చిన మరో గుర్తుతెలియని మృతదేహం వైకుంఠధామం సమీపంలోని ఒడ్డుకు చేరింది. ఈ మృతదేహం వయస్సు సుమారు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎరుపు రంగు ఛాయతో, చిన్న బట్టతల, తెల్లటి జుట్టు, సుమారు ఐదు అడుగుల ఎత్తు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. సిమెంట్ రంగు షర్టు, ఆకుపచ్చ రంగు షార్ట్ ధరించి ఉన్నట్లు వివరించారు.

**-ఒకటి తేలింది.. మరొకటి మిస్టరీ:**

శుక్రవారం భద్రాచలం గోదావరి పరిసరాల్లో లభించిన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించినట్లు సమాచారం. అది తిరువూరుకు చెందిన వ్యక్తిదిగా నిర్ధారణ కావడంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ కేసులో మృతుడి గుర్తింపు సమస్య కొంతవరకు తొలగింది. అయితే శనివారం సారపాక వైపు లభించిన మృతదేహం మాత్రం ఇంకా గుర్తు తెలియని వ్యక్తిగానే ఉంది.

**-వరుస ఘటనలపై అనుమానాలెన్నో!**

రెండు రోజుల వ్యవధిలో గోదావరి ఇరు వైపులా మృతదేహాలు లభించడంతో స్థానికంగా పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గోదావరి ఉధృతి, ప్రవాహ వేగం కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి మృతదేహాలు కొట్టుకొచ్చే అవకాశం ఉందా? నదిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన వారివా? లేక ఇతర ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలకు వీటికి ఏమైనా సంబంధం ఉందా? అన్న కోణాల్లో పరిశీలన సాగుతోంది. అయితే పోస్టుమార్టం, దర్యాప్తు పూర్తయ్యే వరకు మరణానికి కారణం ఏమిటనేది నిర్ధారణ కాలేదు.

**-మిస్సింగ్ కేసులే కీలకం :**

మృతదేహాల గుర్తింపులో ఎగువ, దిగువ ప్రాంతాల్లో నమోదైన మిస్సింగ్ కేసులు కీలకంగా మారనున్నాయి. ఆయా పోలీస్ స్టేషన్లలో ఇటీవల నమోదైన అదృశ్యం కేసులను పరిశీలించి, మృతుల వయస్సు, దుస్తులు, శారీరక ఆనవాళ్లతో సరిపోల్చే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదులు, సమాచారం సేకరించడంతో పాటు మృతదేహాల వివరాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

**-గుర్తిస్తే సమాచారం ఇవ్వండి :**

సారపాక వైపు లభించిన మృతదేహానికి సంబంధించి ఎవరికైనా సమాచారం ఉంటే బూర్గంపాడు పోలీసులను సంప్రదించాలని ఎస్సై మేడా ప్రసాద్ కోరారు. అలాగే వైకుంఠధామం వద్ద లభించిన మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే భద్రాచలం టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. బూర్గంపాడు ఎస్సై: 8712682055 అదనపు ఎస్సై: 8712682057 భద్రాచలం టౌన్ ఎస్‌హెచ్‌ఓ: 8712682105, 8712682160

**-రెండు రోజులు.. రెండు మృతదేహాలు..**

గోదావరి ఒడ్డున వరుసగా వెలుగుచూస్తున్న ఈ ఘటనలు సహజ మరణాలా? ప్రమాదాలా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే ప్రశ్నలకు పోలీసుల దర్యాప్తులోనే సమాధానం లభించాల్సి ఉంది. మృతుల గుర్తింపుతో పాటు వారి మరణానికి దారితీసిన పరిస్థితులు వెలుగులోకి వస్తేనే ఈ మిస్టరీకి తెరపడనుంది.

## అత్తను హత్య చేసి కాల్చి బూడిద చేసిన అల్లుడు

మొదటి పేజీ తరువాయి..

తిరుపతిరావు కు కుమార్తెను ఇచ్చి వివాహం చేయగా గ్రామంలో ఉంటూ తిరుపతిరావు ప్రైవేట్ గా విద్యుత్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. తిరుపతిరావుకు గ్రామంలో మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొనికొని సాగిస్తున్నాడని గత మూడు రోజుల క్రితం కుటుంబీకుల మధ్య వివాదం జరగటంతో దీన్ని ఏ విధంగా అయినా అత్తను కడతేర్చాలని తిరుపతిరావు నిర్ణయించుకున్నాడని కుటుంబీకులు గ్రామస్తులు ద్వారా తెలిసింది. గత మూడు రోజుల నుంచి తల్లి వెంకట నరసమ్మ గ్రామంలో కనిపించడం లేదని సత్తుపల్లి పోలీస్ స్టేషన్లో కుమార్తె ఫిర్యాదు చేయడం జరిగింది. అత్తవెంకట నరసమ్మ హత్యకు కారణం తిరుపతిరావు మరో మహిళతో సంబంధం పెట్టుకోవడమే నని, లేదా ఆస్తి వివాదంలోనూ అయినా ఉండవచ్చని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అల్లుడు హత్య చేసి అత్తను రాత్రి కి రాత్రి తుంబూరు నుంచి సత్తుపల్లి వైపు వచ్చే నారాయణపురం గ్రామ సమీప పామాయిల్ తోటల్లో శవాన్ని కాల్చి బూడిద చేశారని ఆ నోట ఈ నోట సమాచారం పోలీసులుకు అందటంతో ఏసీపీ వసుంధర యాదవ్ ఆదేశాలతో శనివారం సీఐ తుమ్మలపల్లి శ్రీహరి, ఆధ్వర్యంలో ఎస్సై వీర ప్రసాదు, క్లూస్ టీం, శవాన్ని దహనం చేసిన ప్రదేశాన్ని పరిశీలించగా ఖాళీ బూడిదైన ఉండగా ఎముకలను, ముదుసులను, క్లూస్ టీం సేకరించి డిఎన్ఏ పరీక్షకు తీసుకెళ్లారు.

ఇంత దారుణానికి వడిగట్టిన అల్లుడు తిరుపతిరావు, ఈ హత్యకు ఆయనతో సహకరించిన వారికోసం కల్లూరు ఏసిపి వసుంధర యాదవ ఐపీఎస్ పర్యవేక్షణలో సీఐ తుమ్మలపల్లి శ్రీహరి, ఆధ్వర్యంలో ఎస్సై వీరప్రసాద్ పోలీస్ బృందం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు.

# జనగామ కాంగ్రెస్‌లో ఐక్యతే లక్ష్యం



- గ్రూపు రాజకీయాలకు తావులేకుండా సమన్వయంతో పనిచేయాలి

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :**

జనగామ జిల్లాలో కాంగ్రెస్‌పార్టీని క్షేత్రస్థాయినుంచి మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి పిలుపునిచ్చారు. గ్రూపు రాజకీయాలు, వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా పార్టీ ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకుసాగాలని సూచించారు. జనగామ జిల్లా కేంద్రంలోని భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో శనివారం జిల్లాకాంగ్రెస్ కమిటీ సమీక్ష సమావేశం నూతన జిల్లా, మండల, పట్టణ కాంగ్రెస్‌కమిటీల సన్మానం, ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కాంగ్రెస్ కార్యవర్గాల ప్రమాణ స్వీకారం నిర్వహించడంతోపాటు పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపరిష్కారం, రాబోయే ఎన్నికలకు పార్టీని సిద్ధం చేయడం వంటి అంశాలపై వారు సమీక్షించారు. అనంతరండీసీసీ లకావత్ ధన్వంతి మాట్లాడుతూ పార్టీనాయకులు, కార్యకర్తల మధ్యఉన్న సమన్వయంతో పరిష్కరించుకోవాలని, ప్రతి కార్యకర్త సైనికుడిలా పార్టీకోసం పనిచేయాలని కోరారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను బూత్‌స్థాయి నుంచి ప్రతిఇంటికీ తీసుకెళ్లాలని అన్నారు.

**- ఐక్యంగా పనిచేస్తేనే పార్టీకి బలం..: వరంగల్ ఎంపీ కడియం కావ్య**

కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తే జనగామలో పార్టీ మరింత బలపడుతుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కావ్య పిలుపునిచ్చారు.

**- ప్రభుత్వ పథకాలు ప్రతీ ఒక్కరికి అందేలా కృషిచేయాలి..: పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి**

ప్రజాసమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉండాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సూచించారు.

**- కాంగ్రెస్‌పార్టీ బలోపేతమే ప్రధాన లక్ష్యం..: వైటీడీపీ బోర్డు మెంబర్ డా.ఎల్.లక్ష్మీనారాయణ నాయక్**

వ్యక్తిగత, గ్రూపు విభేదాలను పక్కనపెట్టి కాంగ్రెస్ బలోపేతమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని వైటీడీపీ బోర్డు మెంబర్ డా.ఎల్.లక్ష్మీనారాయణ నాయక్ కోరారు. గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేసి రాబోయే ఎన్నికలకు ఇప్పటి నుంచే సమన్వయంతో సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జనగామ మున్సిపల్ చైర్పర్సన్ కడకంచి బాలమణి, స్టేషన్‌ఘనపూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య, మున్సిపల్ చైర్మన్ వేముల్ల సత్యనారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కంచ రాములు, రాజమౌళి, జగదీష్ చంద్రరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గుడి వంశీధర్ రెడ్డి, ఉడత రవి, నూకల బాల్‌రెడ్డి, ఉప్పల మేడ శ్రీనివాస్, దోర్నాల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సకినాల రాజేశ్వరికి రాష్ట్రచేనేత అవార్డు

**బచ్చన్నపేట, ఆగస్టు 8 ప్రభాతవార్త :**

బచ్చన్నపేట మండలానికి చెందిన యువచేనేత కళాకారిణి సకినాల రాజేశ్వరి ప్రతిష్ఠాత్మక కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రచేనేత అవార్డును అందుకున్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతులమీదుగా రాజేశ్వరి అవార్డును స్వీకరించారు. చేనేత రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు రాజేశ్వరిని రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుకు ఎంపిక చేసింది. బచ్చన్నపేట ప్రాంతానికి చెందిన చేనేత కళాకారిణికి రాష్ట్రస్థాయి అవార్డు దక్కడంపట్ల స్థానికులు, చేనేత కార్మికులు హర్షం వ్యక్తంచేశారు. రాజేశ్వరికి పలువురు అభినందనలు తెలిపారు.

## ఈవీఎం గోదాం పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి



**జనగామ, ఆగస్టు 8 ప్రభాతవార్త :**

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నెలవారీ తనిఖీలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో గల ఈవీఎం గోదాంను శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతానమోదు పుస్తకం, సీసీ కెమెరాల పనితీరు, మంటల నియంత్రణ పద్ధతులను పర్యవేక్షించారు. భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీసు సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో జనగామ ఆర్డీఓ గోపీరాం, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



- ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి సర్పంచ్‌ల వినతి

**రఘునాథపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త :**

రఘునాథపల్లి మండలానికి చెందిన పలువురు సర్పంచులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని శనివారం కలిసి గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌళికవసతుల కల్పనకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. పంచాయతీ భవనాలులేని గ్రామాలకు భవనాలు మంజూరు చేయడంతో పాటు, అత్యవసర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని అన్నిగ్రామాల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సర్పంచులు కోరారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరుచేసి ప్రజలకు మెరుగైన మౌళికవసతులు కల్పించేందుకు సహకరించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రఘునాథపల్లి సర్పంచ్ బొల్లం ఉమారాణి రాజీవ్, కుసుంబాయి తండా సర్పంచ్ కొర్ర స్వరూప రాజేందర్ నాయక్, బానోజీపేట సర్పంచ్ గైని శ్రీనివాస్, ఆంధ్రతండా సర్పంచ్ భూక్య శ్రీను, కోడూరు సర్పంచ్ లలిత సోమయ్య, గోవర్ధనగిరి సర్పంచ్ తోటకూర సదానందం, ఖిలాషాపూర్ సర్పంచ్ శాగ కవిత అశోక్, మేకలగట్టు సర్పంచ్ ఇల్లందుల రవి, శ్రీమన్నారాయణపురం సర్పంచ్ వెంకటేష్, మాదారం సర్పంచ్ సరిత మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు.

**పినపాక, ప్రభాత వార్త, ఆగష్టు 08.**

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయిన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నర్సింగ్ ఆఫీసర్ లు గా విధులు నిర్వహిస్తున్న గడ్డిగూడెం గ్రామానికి చెందిన మద్దెల ఇమావతి, మద్దులగూడెం గ్రామానికి చెందిన కొర్సా రాణి లు తమ విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఇమావతి తండ్రి మద్దెల




నరసింహారావు తన ద్విచక్ర వాహనంపై వీరిని ఇంటికి తీసుకువెళ్తుండగా ప్రమాదం జరిగింది. రామానుజరం నుంచి ఇసుకలోడుతో హైదరాబాద్ వెళుతున్న ఇసుక లారీ వీరి పైనుంచి వెళ్లడంతో మద్దుల నరసింహారావు తీవ్రంగా గాయపడ్డారు, మరో ఇద్దరు వైద్య సిబ్బంది సైతం తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన వారిని అంబులెన్స్ సాయంతో మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఏడూళ్ల బయ్యారం ఎస్ఐ సురేష్ ఘటనా స్థలానికి చేరుకొని ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.

# సర్‌కు సహకరించిన కాంగ్రెస్ శ్రేణులకు ధన్యవాదాలు

## డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల

**పాల్వంచ టౌన్, ఆగష్టు 8 ప్రభాతవార్త:**

ఓటర్ల జాబితా సవరణ (సర్) కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, సహకరించిన కాంగ్రెస్ శ్రేణులకు డీ.సీ.ఎం.ఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. కొత్తగూడెంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బి.ఎల్.ఎ సూపర్ వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్ పి.సి.సి. కోఆర్డినేటర్ మాసనపల్లి లింగోజి, కొత్తగూడెం నియోజకవర్గ



కోఆర్డినేటర్ ఆళ్ల మురళీ లతో కలిసి కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ... సర్ కార్యక్రమంలో బూత్ లెవల్ ఆఫీసర్లతో పాటు కాంగ్రెస్ పార్టీ నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు ఇంటింటికీ తిరిగి ఓట్ల నమోదు అయ్యేలా కృషి చేశారని అన్నారు. ఓటర్ల నమోదు లో బీ.ఎల్.ఓ లు, కాంగ్రెస్ పార్టీ బీ.ఎల్.ఏ లు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ ఓటర్లను చైతన్యపరిచారన్నారు. సర్ కార్యక్రమానికి సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలకు, అధినాయకత్వానికి కొత్వాల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగోజీ, ఆళ్లమురళీ, కొత్వాల తో పాటు కాంగ్రెస్ నాయకులు వై.శ్రీనివాసరెడ్డి, నూకల రంగారావు, గంగిరెడ్డి భువన సురేందర్ రెడ్డి, వాసు మల్ల సుందర్ రావు, గుర్రం వెంకటరత్నం, ఉండేటి శాంతివర్ధన్, గుండు రవి, వాలపల్లి రాంబాబు, సందు ప్రభాకర్, భట్టు మురళి, బత్తుల వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నేడు నల్లబెల్లికి కేసీఆర్ రాక

## -పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించనున్న అధినేత

**నర్సంపేట, ఆగస్టు 8, ప్రభాతవార్త**

తెలంగాణ ఉద్యమ కారుడు, టీఆర్ఎస్ పార్టీ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి దశ దిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హాజరుకానున్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గత నెల 26 హన్మకొండలో తన నివాసంలో గుండెపోటుకు గురై స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గ్రీన్ చానల్ ద్వారా హైద్రాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి కి తరలించగ చికిత్స పొందుతు ఈనెల 31 న మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా పార్టీ స్థాపించిన నాటి నుంచి ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ, పార్టీ కోసం కృషి చేస్తూ, తన ముఖ్య అనుచరుడుగా కొనసాగిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో విషాదంలో ఉన్న అధినేత కేసిఆర్ తన ఆప్తుని కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. ఈ మేరకు నేడు నర్సంపేట నియోజకవర్గం లోని పెద్ది స్వగ్రామమైన నల్లబెల్లికి బయలుదేరిరానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా, ఇంటి పెద్దను కోల్పోయి శోక తప్త హృదయులై వున్న పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి కష్టకాలంలో ఉన్న వారికి భరోసా ఇవ్వనున్నారు. ఇదే సందర్భంలో, నర్సంపేట నియోజకవర్గం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, పెద్ది అభిమానులకు అధినేత కేసిఆర్ గుండె ధైర్యం నింపనున్నారు. కాగా పెద్ది కుటుంబాన్ని ఆదుకునేందుకు తన విశాల హృదయాన్ని చాటుకున్న కేసీఆర్ గారు, ఇప్పటికే 2 కోట్ల 25 లక్షల రూపాయలను ఆర్థిక సహాయం ప్రకటించారు.

**-హెలికాప్టర్‌లో హన్మకొండకు కెసిఆర్...**

తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గజ్వేల్ లోని తన ఫాంహౌస్ నుంచి నేరుగా హెలికాప్టర్ ద్వారా హన్మకొండ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్దకుచేరుకుంటారు. అక్కడ నుంచి వాహనం లో హన్మకొండ జిల్లా ఆత్మకూర్ జాతీయ రహదారి గుండా మహమ్మద్ గౌస్ పల్లి మీదుగా నల్లబెల్లి మండల కేంద్రానికి చేరుకుంటారు. ఈ మేరకు టీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకత్వం తగిన ఏర్పాట్లు చేశారు.

# పెద్ది అకాల మరణం తీరని లోటు- దయాకర్‌రావు

**చెన్నారావుపేట, ఆగస్టు 8, ప్రభాతవార్త**

మాజీ ఎమ్మెల్యే తెలంగాణ ఉద్యమనేత స్వర్గీయ పెద్ది సుదర్శన్‌రెడ్డి మరణం నర్సంపేటకే కాకుండా పార్టీకి, తెలంగాణకే తీరని లోటని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆత్మశాంతి చేకూరాలంటూ మండలంలోని చెన్నారావుపేట అమీనాబాద్ గ్రామాల్లో శనివారం సంతాప సభలు ఏర్పాటు చేశారు. అలాగే పెద్ది చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్ది మరణం ఎంతో దురదృష్టకరమన్నారు. యువకుడిగా తెలంగాణ ఉద్యమంలో ఎన్నో అష్టకష్టాలు పడి రాష్ట్ర స్థాయికి ఎదిగాడన్నారు. పోలీసులు దెబ్బలు, కేసులు, జైళ్ల పాలు అయ్యాడన్నారు. తెలంగాణ ఏర్పాటుతో ఆయన కళ సాకారం అయిందన్నారు. అలాంటి వ్యక్తి నర్సంపేట ప్రాంతాభివృద్ధికి ఎంతో కృషి చేశాడన్నారు. ఈ క్రమంలో అకాల మరణం తీరని శోకాన్ని మిగిల్చిందనానరు. నాయకుడు లేడని ఆందోళనకు గురికావద్దన్నారు. పెద్ది స్ఫూర్తితో కార్యకర్తలంతా ఎల్లప్పుడు ఆశయ సాధనకు అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బాల్నె వెంకన్న, మాజీ జడ్పిటిసి పత్తినాయక్, జున్నుతుల రాంరెడ్డి, మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్, మాజీ సొసైటి చైర్మన్ మురహరి రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు అనుముల కుమారస్వామి, అమ్మ రాజేష్, ఎండి రఫీ, కుసుమ నరేందర్, కుండె మల్లయ్య, కడారి సాయిలు, ములుక సాంబయ్య, మూడు రమేష్, బొడ మురళీనాయక్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఐలయ్య, సాంబయ్య, గట్ల రాంబాబు, రాసమల్ల సతీష్ తదితరులు ఉన్నారు.

# నేరాలు-దారుణాలు

## ఉరేసుకొని యువకుడు బలవన్మరణం ..

**కొణిజర్ల ఆగస్టు 8 ప్రభాత వార్త:**




కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన విషాదకర ఘటన మండల పరిధిలోని తనికెళ్ళ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. మృతుని తల్లి శాంతమ్మ స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పెద్దగౌండ్ల గోపి (28) భార్యాభర్తల మధ్య ఘర్షణ నేపథ్యంలో, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మద్యం మత్తులో ఫ్యాన్ కు ఉరేసుకుని బలవన్మనానికి పాల్పడ్డాడు. తెల్లారే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు పోలీసుల సంఘటన స్థలాన్ని చేరుకునే మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి మూడేళ్ల కుమారుడు ఉన్నారు

## గోదావరి బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

**సారపాక, ఆగస్టు 8 (ప్రభాతవార్త):**

భద్రాచలం గోదావరి బ్రిడ్జి సారపాక వైపు మూడో నంబర్ పిల్లర్



వద్ద గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తిగా ఎస్సై మేడాప్రసాద్ తెలిపారు. మృతుడు బూడిదరంగు ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో అతని కుటుంబ సభ్యులు, బంధువుల ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మృతుడి గురించి ఎవరికైనా సమాచారం తెలిసినా, తమ కుటుంబ సభ్యుడు లేదా బంధువు కనిపించకుండా పోయినట్లయితే వెంటనే బూర్గంపహాడ్ పోలీసులను సంప్రదించాలని కోరారు. సమాచారం కోసం ఎస్సై: 8712682055అదనపు ఎస్ఐ: 8712682057నెంబర్లను సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

## కల్లూరు పట్టణ కాంగ్రెస్ ఇన్చార్జిగా కోసూరు

**తల్లాడ ఆగస్టు 8: ప్రభాతవార్త**



కల్లూరు పట్టణ కాంగ్రెస్ ఇన్చార్జిగా మండల పరిధిలోని అందరం చెందిన కోసూరి వెంకటేశ్వర్లు ను నియమిస్తూ డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు ఈ మేరకు వెంకటేశ్వర్లు ఆయనే స్వయంగా అందజేశారు ఓ బి సి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్న వెంకటేశ్వర్లు కు కల్లూరు పట్టణ ఇన్చార్జిగా నియమించిన పట్ల పలువురు హర్షం వెలిబుచ్చారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని కోసూరి ఓ ప్రకటనలు తెలిపారు

## చిన్న అరుణాచల క్షేత్రంలో షాపు నిర్వహణకు వేలం పాటలు

**దుమ్ముగూడెం ప్రభాతవార్త :**

మండలం నరసాపురం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ అష్టాదశ శక్తిపీఠ మహాక్షేత్రం చిన్న అరుణాచలంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకి దేవాలయం అనుబంధ షాపుల్లో ఒకటైన పండ్లు పూలు అమ్మడానికి షాపుకి వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు శివ నాగ స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు ఆసక్తి గలవారు చిన్న అరుణాచల క్షేత్రాన్ని సంప్రదించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు




## విపత్తులపై విద్యార్థులకు అవగాహన

**భద్రాచలం, ఆగస్టు 8(ప్రభాతవార్త):**




విపత్తులు సంభవించినప్పుడు అప్రమత్తత, ఆత్మవిశ్వాసం, సమయస్ఫూర్తితో వ్యవహరించేలా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు భద్రాచలంలోని సెయింట్ పాల్స్ లూథరన్ పాఠశాలలో ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీమ్ కమాండర్ కమలేష్ సింగ్ నేతృత్వంలోని బృందం వరదలు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు తదితర విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాణరక్షణ చర్యలను ప్రాయోగికంగా వివరించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డా. కె. అబ్రహాం మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలు, అవగాహనతో విపత్తుల ప్రభావాన్ని తగ్గించవచ్చన్నారు. హెడ్‌మిస్ట్రెస్ డా. కె. రాధా మంజరి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు.

## ఆగస్టు 10న జరిగే జైల్ భరోను జయప్రదం చేయాలి

**-వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బందెల చంటి**

**చర్ల, ఆగస్టు 8, (ప్రభాతవార్త)**

సిఐటియు ఏఐడ్యూయు ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బందెల చంటి కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నిర్వహించిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేటి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులు, సంఘటిత అసంఘటిత కార్మికులు పేదలు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర, ఎరువులు కొనుటకు ఆన్లైన్ విధానాన్ని నిలిపివేయాలి వ్యవసాయ కార్మికులకు ఉపాధి కూలి సంక్షేమం వంటి సమస్యలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలపై భారాలు మోపే విధానాలను ఉపసంహరించుకోవాలని రైతులు వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమంలో మండల ప్రజలు రైతులు వ్యవసాయ కార్మికులు, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో రైతు సంఘం మండల కార్యదర్శి నల్లగట్ల మూర్తి ఉన్నారు.




# పచ్చని భద్రాచలమే లక్ష్యం

**-మొక్కలు నాటడమే కాదు..**

**సంరక్షణా బాధ్యత తీసుకోవాలి**

**-సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ**

**భద్రాచలం, ఆగస్టు 8(ప్రభాతవార్త):**

భద్రాచలం పట్టణాన్ని పచ్చని వనంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. గ్రీన్ భద్రాద్రి-భద్రాచలం ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సబ్‌కలెక్టర్ మృణాల్



శ్రేష్ఠ, గౌరవ అతిథి సర్పంచ్ పునేం కృష్ణదొరతో కలిసి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలం పవిత్ర పుణ్యక్షేత్రం కావడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణానికి నిలయంగా మార్చేందుకు విస్తృతంగా మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటిన తర్వాత వాటిని నిర్లక్ష్యం చేయకుండా సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. వచ్చేతరం పెంపుతో భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. సర్పంచ్ పునేం కృష్ణదొర మాట్లాడుతూ గ్రీన్ భద్రాద్రి చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి సెక్రటరీ రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రామ్‌ప్రసాద్‌రెడ్డి, పూర్వ అధ్యక్షులు డా. గోళ్ల భూపతిరావు, కామిశెట్టి కృష్ణార్జునరావు, డా. శివరామకృష్ణ, వీరయ్య, సంపత్, ఆలయ పూజారి విశ్వనాథం, కార్‌స్టాండ్ అధ్యక్షుడు, సభ్యులు, వృక్ష ప్రేమికులు, దాతలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. 'వృక్షో రక్షతి రక్షితః' నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రకృతిని ప్రేమిద్దాం.. మొక్కలు నాటుదాం.. భవిష్యత్ తరాలను కాపాడుదాం అంటూ నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# అంగరంగ వైభవంగా బోనాలు

**-భారీ ఊరేగింపుతో**

**ప్రగతి విద్యానికేతన్ విద్యార్థులు**

**సారపాక, ఆగస్టు 8 (ప్రభాతవార్త):**

బోనాల పండుగను పురస్కరించుకొని సారపాకలోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో బోనాల వేడుకలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల కరెస్పాండెంట్ సానికొమ్ము చైతన్య ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సంప్రదాయ వేషధారణలతో అలరించారు. ముఖ్యంగా పోతురాజుల వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటి వద్దనే సంప్రదాయబద్ధంగా సిద్ధం



చేసి, అందంగా అలంకరించిన బోనాలతో పాఠశాలకు తీసుకువచ్చారు. పాఠశాల ప్రాంగణంలో డీజే పాటలకు విద్యార్థులు ఉత్సాహంగా నృత్యాలు చేయగా, తల్లిదండ్రులు సైతం వారితో కలిసి సందడి చేశారు. అనంతరం మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, నృత్యాల నడుమ భారీ బోనాల ఊరేగింపు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంప్రదాయ దుస్తుల్లో ఊరేగింపుగా ముత్యాలమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ సానికొమ్ము చైతన్య మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను చిన్ననాటి నుంచే విద్యార్థులకు పరిచయం చేయడం ఎంతో అవసరమన్నారు. బోనాల పండుగ ద్వారా తెలంగాణ జానపద సంస్కృతి, భక్తి, ఐక్యత, సంప్రదాయ విలువలను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య ఆత్మీయతను పెంపొందించేలా ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాల హెడ్‌మాస్టర్ ఎన్. సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తి, సంప్రదాయం, ఉత్సాహం, ఆనందం కలగలిసిన బోనాల వేడుకలు సారపాకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## చేయూత పెన్షన్ దరఖాస్తులు పంచాయతీ కార్యదర్శులకే ఇవ్వాలి

**-మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించొద్దు**

**-డబ్బులు చెల్లించొద్దు -ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి**

**మరిపెడ, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

చేయూత పథకం కింద వివిధ రకాల పెన్షన్లకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని మరిపెడ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేణుగోపాల్ రెడ్డి సూచించారు. అర్హులైన దరఖాస్తుదారులు సంబంధిత ఫారంలో పూర్తి వివరాలను నమోదు చేసి, అవసరమైన ధ్రువపత్రాలను జతపరిచి తమ గ్రామానికి సంబంధించిన పంచాయతీ కార్యదర్శికి మాత్రమే దరఖాస్తును అందజేయాలని తెలిపారు. చేయూత పథకం కింద వితంతు, వికలాంగులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, తాడి టాపర్లు, బోదకాలు బాధితులు, డయాలసిస్ బాధితులు తదితరులకు సంబంధించిన పెన్షన్ల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను మధ్యవర్తులు, దళారులకు ఇవ్వకూడదని, ఇతర శాఖలకు చెందిన వ్యక్తులకు కూడా అందజేయవద్దని ఎంపీడీవో స్పష్టం చేశారు. పెన్షన్ మంజూరు చేయిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే చెల్లించవద్దని, ఎటువంటి ప్రలోభాలకు లోనుకావద్దని సూచించారు. పెన్షన్ మంజూరు ప్రక్రియలో ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి కోరారు.

## మరో క్విట్ ఇండియా ఉద్యమంలా ఆగష్టు 10న జైలు భరో కార్యక్రమం

**-సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్**

**గార్ల, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సంఘటిత, అసంఘటిత రంగ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే జైల్ భరోలో కార్మికులు, వ్యకాస కార్మికులు, రైతులు యువకులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ నెల 10న జరపనున్న జైల్ భరో కార్యక్రమలో భాగంగా స్థానిక సిపిఎం కార్యాలయంలో వి.పి. వెంకటేశ్వర్లు అధ్యక్షతన సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి బడ్జెట్ తగ్గించే కుట్రలను తిప్పికొట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, ఆయా సంఘాల నాయకులు ఎ.వీరాస్వామి, ఎం.నాగమణి, కె. ఈశ్వర్ లింగం, రామకృష్ణ, రామకృష్ణ, వీరభద్రం, శ్రీను, నాగరాజు తదితరులు ఉన్నారు.




# సమగ్ర సాగునీటి ప్రణాళికను ప్రకటించాలి

**-మాజీ మంత్రి పువ్వాడ**

**ఖమ్మం అర్బన్, ఆగస్టు 8 (ప్రభాతవార్త):**



ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సాగునీటి లభ్యత, వినియోగం, నీటి విడుదలపై రైతులకు ప్రభుత్వం స్పష్టమైన అవగాహన కల్పించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో పంటల సాగుకు అవసరమైన నీటి లభ్యతపై స్పష్టత ఇవ్వడంతో పాటు, రైతులు ముందస్తుగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకునేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని మాజీ మంత్రి పువ్వాడ పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షపాతంలో హెచ్చుతగ్గుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. సాగర్, గోదావరి, మున్నేరు, వైరా, పాలేరు, కిన్నెరసాని తదితర జల వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేసి, ఆయకట్టు రైతులకు ముందస్తుగా సమాచారం అందించాలని కోరారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో ప్రస్తుతం ఎంత మేరకు నీటి నిల్వలు ఉన్నాయి, ఎప్పుడు నీటిని విడుదల చేస్తారు, ఏ ప్రాంతాలకు ఎంత మేరకు నీరు అందుబాటులో ఉంటుంది అనే వివరాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షించి అధికారికంగా ప్రకటించాలని అన్నారు. నీటి విడుదలకు సంబంధించి ముందస్తు షెడ్యూల్‌ను ప్రకటిస్తే రైతులు పంటల ఎంపిక, సాగు సమయం, నీటి వినియోగంపై సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి నిర్వహణ, నీటి లభ్యతపై ఎలాంటి అనిశ్చితి లేకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడితే రైతులు నష్టపోకుండా పంటల సాగును ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని చాటిన త్రివేణి విద్యార్థులు

**ఖమ్మం విద్యా విభాగం, ఆగస్టు 8 (ప్రభాత వార్త):**



క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్మరించుకుంటూ త్రివేణి టాలెంట్ స్కూల్స్, ఖమ్మం శాఖలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీజీ ఇచ్చిన "భారత్ విడిచి వెళ్లండి" పిలుపు స్వాతంత్ర్య పోరాటంలో ప్రజల ఐక్యత, త్యాగానికి ప్రతీకగా నిలిచిందని ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు జాతీయ పతాకాలతో దేశభక్తి గీతాలు, ప్రసంగాలు, నినాదాలతో స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ , వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా గార్ల వీదుల్లో రామనామ తరంగం

**గార్ల, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

వికాస తరంగిణి ఆధ్వర్యంలో పరమపూజ్య శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామివారి 70వ తిరునక్షత్ర మహోత్సవాలను పురస్కరించుకుని గార్ల గ్రామంలో నిర్వహించిన శ్రీరామ హృదయ కలశ శోభాయాత్ర అత్యంత దిగ్విజయంగా, భక్తిపారవశ్యంతో ముగిసింది. పురవీధుల్లో మంగళ నీరాజనాలు గార్ల పుర వీధుల గుండా సాగిన ఈ శోభాయాత్రకు ప్రతీ ఇంటి ముందు మహిళలు మంగళహారతులు, వర్ణరంజితమైన ముగ్గులతో దివ్య స్వాగతం పలికారు. ప్రతి భక్తుడు తన హృదయపూర్వక "శ్రీరామ" నామ స్మరణతో 108 పవిత్ర బియ్యం గింజలను కలశంలో సమర్పించి, స్వామివారి దివ్య అనుగ్రహాన్ని, హృదయ పూర్వక ఆశీస్సులను పొంది పునీతులయ్యారు. ఊరువాడ ఏకమై, వికాస తరంగిణి సభ్యులు, ఆలయ నిర్వాహకులు, ఉత్సాహవంతులైన యువత, మహిళలు, గ్రామ పెద్దలు భక్తిశ్రద్ధలతో భాగస్వాములై సమాజంలో ఐక్యతను చాటిచెప్పారు. ఈ పవిత్రమైన శ్రీరామకార్యంలో పాల్గొని తమ విలువైన సలహాలు, సహకారం అందించి శోభాయాత్రను సంపూర్ణంగా విజయవంతం చేసిన గార్ల మండల భక్తజనులందరికీ, యువతకు, గ్రామ పెద్దలకు వికాసతరంగిణి ధన్యవాదాలు తెలిపారు.



## శనివారం మన ప్రభుత్వ వైద్యశాలకు సెలవంట

**డాక్టర్ విధులు నిర్వహిస్తున్న ఫార్మాసిస్టు**

**ఆళ్లపల్లి 08 ఆగష్టు ప్రభాతవార్త:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆళ్లపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్యశాలలో సిబ్బంది పనితీరు ఇలా ఉంది ఒక శనివారమే సిబ్బంది మొత్తం సెలవు పెట్టడంతో ఒక ఫార్మా సిస్టే అన్ని విధులు నిర్వర్తించారు. మండల కేంద్రంలో ఉన్న ఏకైక వైద్యశాలకు ఈ దుస్థితి రావడంతో స్థానికంగా ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొన్నారు. వైద్య సేవలకు అందించాల్సిన సిబ్బంది చెప్పాపెట్టకుండా విధులకు గైరాజు అవడంతో రోగులకు సరైన చికిత్సను అందించేవారు లేక పడిగాపులు పడుతున్నారు ఫార్మాసిస్టు విధులుగా నిర్వహిస్తున్న డాక్టర్ గా అవతారం ఎత్తి వచ్చిన రోగులకు ఆయనే వైద్యుడిగా మారి మందులిచ్చి వైద్యం అందించారు. పొరపాటున రోగులకు వైద్యం వికటిస్తే జరిగే పరిణామాలకు అర్థం కాక స్థానికులు తలలు పట్టుకుంటున్నారు. ఆళ్లపల్లి వైద్యశాలపై మొదటినుంచి నిరక్ష  ్యంల్ల వహిస్తున్న ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంత వైద్యాన్ని పూర్తిగా నిరక్ష  ్యంల్ల చేస్తుంది ఇదే విషయంపై గతంలో అనేక పర్యాయాలు మీడియాలో వార్తలు వచ్చినప్పటికీ ఇప్పడవరకు అటువైపు కన్నెత్తి చూసిన పాలకులుగాని ఉన్నత వైద్యాధికారులకు లేకపోవడం విశేషం ఇదే విషయంపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డి ఎం హెచ్ ఓ వివరణ కోరగా ఆయన ఈ విధంగా స్పందించారు. ప్రభుత్వ ఇచ్చే సెలవుల్లో వైద్య శాఖ అత్యవసర విభాగాలలోమినహా ఉన్నప్పటికీ ప్రభుత్వ సెలవులు ప్రకటిస్తే అది వీరికి కూడా వర్తిస్తుందని మాట్లాడడం ఆశ్చర్యానికి కలిగిస్తుంది. ఏది ఏమైనాప్పటికీ ప్రభుత్వ శాలలో వైద్యాధికారులు సిబ్బంది ఏర్పాటు చేసి మంచి వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారని అన్నారు

## ఎరుకల సంఘం మండల కమిటీ ఎన్నిక

**మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

మహబూబాబాద్ మండల ఎరుకల సంఘం నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు కుతాడి కుమార్ ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సంఘం మండల అధ్యక్షులుగా దాసరి వీరన్న, ప్రధాన కార్యదర్శిగా పేరు భద్రయ్య, మండల ఉపాధ్యక్షులుగా పల్లకొండ యాకయ్య, మండల కోశాధికారిగా రాయపురం శేఖర్‌లు ఎన్నికైయ్యారు. మండలంలో సంఘం బలోపేతానికి తమవంతు కృషిచేస్తామని నూతన కమిటీ బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కేతిరి ఉప్పలయ్య, రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు రాయపురం సంపత్, జిల్లా ప్రధాన కార్యదర్శి పేరం బక్కయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కుంభం ప్రశాంత్, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ రాగం మల్లయ్య, జిల్లా యూత్ అధ్యక్షులు కోట ఎల్లేష్, కేసముద్రం మండల అధ్యక్షులు కట్ల పాపయ్యలు పాల్గొన్నారు.

## సర్వజ్ఞలో బోనాల సందడి

**ఖమ్మం విద్యా విభాగం ఆగస్టు 8, (ప్రభాత వార్త):**




ఖమ్మం పట్టణం విడిఒస్ కాలనీలోని సర్వజ్ఞ పాఠశాలలో తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే మహోత్తర పండుగ బోనాలను పురస్కరించుకొని బోనాల పండుగ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ.. "బోనాలు కేవలం పండుగ మాత్రమే కాదు, ఇదొక సామూహిక వేడుక. ఊరంతా కలిసి అమ్మవారిని కొలిచి, పల్లకి సేవలు, పోతరాజుల విన్యాసాలు, ఆడపడుచు నృత్యాలు, డప్పుల శబ్దాలతో సందడిగా జరుపుకుంటారు. ఇది ప్రజలలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తుంది, మన తెలంగాణ సంస్కృతి, జీవన విధానం. అమ్మవారి ఆశీస్సులతో అందరి జీవితాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కె. నీలిమ ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

**-ఉమ్మడి వరంగల్ ఖమ్మం జిల్లాల**

**ఎం ఎస్ ఎఫ్ ఇంచార్జ్ ముఖేష్ మాదిగ**

**ఖమ్మం విద్యా విభాగం ఆగస్టు 8, ప్రభాత వార్త:**

సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లో జరిగే మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని, ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్దఎత్తున తరలిరావాలని ఉమ్మడి వరంగల్ ఖమ్మం జిల్లాల ఎం ఎస్ ఎఫ్ ఇంచార్జ్ ముఖేష్ మాదిగ పిలుపునిచ్చారు. మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభను జయప్రదం చేయటంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్థానిక ఖమ్మం నగర కేంద్రంలో ఎస్ ఎం హెచ్ హాస్టల్ లో శనివారం ఖమ్మం జిల్లా ఎస్ ఎం ఎస్ ఇంచార్జ్ ఊటుకూరి రత్నాకర్ మాదిగ అధ్యక్షతవిద్యార్థులు విద్యార్థి నాయకులతో సమావేశంజరిగింది . ఈ కార్యక్రమంలో కొత్తగూడెం జిల్లా ఎం ఎస్ ఎఫ్ కో ఇంచార్జ్ ఉమ్మడి వరంగల్ ఖమ్మం జిల్లాల ఎం ఎస్ ఎఫ్ ఇంచార్జ్ ముఖేష్ మాదిశ్యాంప్రసాద్ మాదిగ జిల్లా కమిటీ సభ్యులు కొత్తపల్లి సాయి మాదిగ రాము మాదితదితరులు పాల్గొన్నారు.






# ధర్మన్ననగర్‌లో అంగన్వాడీ కేంద్రం ప్రారంభం

**గిరిజన చిన్నారులకు ప్రాథమిక విద్య అందించడమే లక్ష్యం**

**ఎమ్మెల్య జారె ఆదినారాయణ**

**ములకలపల్లి, ఆగస్టు 08 ప్రభాతవార్త :**

ములకలపల్లి మండలంలోని ధర్మన్ననగర్ గిరిజన, గొత్తికోయ నివాస ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన కంటెయినర్ ఆధారిత అంగన్వాడీ కేంద్రాన్ని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శనివారం ప్రారంభించారు. డైనాటా సంస్థ సీఎస్‌ఆర్ నిధులు (2026–27), 'సమారిటన్స్–ఫర్ ది నేషన్' ఎన్జీవో సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు వందన గౌడ్, డైనాటా సంస్థ ప్రతినిధులు



హాజరయ్యారు. గ్రామానికి వచ్చిన అతిథులకు గిరిజనులు, గొత్తికోయలు సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఇదే వేదికపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'తల్లిపాల వారోత్స వాలను' ప్రారంభించి, లబ్ధిదారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్య, పౌష్టికాహారం, మెరుగైన సంరక్షణ అందించడమే లక్ష్యంగా ఆధునిక కంటెయినర్ అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి సహకరిస్తున్న డైనాటా సంస్థ, సమారిటన్స్ ఎన్జీవోకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం అందుబాటులోకి రావడంతో గిరిజన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంజా రవి, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ సర్పంచ్ కారం సుధీర్, యూత్ కాంగ్రెస్ నాయకులు సుమిత్, వంశీ, సేవాదళ్ నాయకుడు తిరుపతి రెడ్డి, ఐసీడీఎస్ పీడీ, సీడీపీఓ, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లాకు 10 పతకాలు

**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 8 ప్రభాతవార్త:**




తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో , హన్మకొండ, జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో నిన్నటితో శుక్రవారం రాష్ట్ర జావెలిన్ డే అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు ప్రతిభ కనబర్చి మొత్తం 10 పతకాలు సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహీధర్ తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు నాలుగు బంగారు, నాలుగు రజత, రెండు కాంస్య పతకాలు గెలుచుకుని జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. చర్ల కు చెందిన ఎం.శ్రీ విద్యా దొర 100 మీటర్ల పరుగుపందెంలో మరియు లాంగ్ జంప్ లో రెండు బంగారు పతకలు గెలుపొందారు భద్రాచలంకి చెందిన ఎస్కే.అమిన్ జావీలిన్లో బంగారు పతకం, టి అవంతిక సాయి మంజుశ్రీ 150 మీటర్ల పరుగు పందెం లో బంగారు పతకం,బి. పృద్విక జావీలిన్ లో రజత పతకం, కొత్తగూడెం కు చెందిన సిహెచ్.వేదశ్రీ షాట్ పుట్ లో రజత పథకం, బి.శైలేష్ షాట్ పుట్ లో రజక పథకం పాల్వంచకు చెందిన బి. సౌమ్య జావీలిన్ లో రజిత పథకం, ఏ.నందిని జావిలిన్ లో కాంస్య పథకం, ఎస్. అక్షి త జాలిలైన్ లో కాంస్య పథకం గెలుపొందారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అధికారి ఎం. పరంధామ రెడ్డి విజేతలను, అథ్లెటిక్స్ కోచ్‌లు పి. నాగేందర్, డి.మల్లికార్జున్, జన్ను గిరి ప్రసాద్ లను ప్రత్యేకంగా అభినందించారు.

## ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శిగా జె.గట్టయ్య

**రుద్రంపూర్, ఆగస్టు 8 ప్రభాతవార్త:**



సింగరేణి కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన జె.గట్టయ్యను కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ శనివారం ఏరియా జీఎం సీహెచ్. వెంకటరమణకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా వంగ వెంకట్ మాట్లాడుతూ... సంస్థ అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి ఏఐటీయూసీ కట్టుబడి ఉందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం సహకరించాలని కోరారు. నూతన కార్యదర్శి జె.గట్టయ్యకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## కన్వేయర్ రోలర్ల ఉత్పత్తి సామర్థ్యం పెంచాలి

**సోలార్ ప్లాంట్, మెయిన్ వర్క్‌షాప్ పరిశీలించిన డైరెక్టర్ తిరుమలరావు**

**కొత్తగూడెం, ఆగస్టు 8 ప్రభాతవార్త:**



సంస్థ అవసరాలకు అనుగుణంగా కన్వేయర్ రోలర్ల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని డైరెక్టర్ (ఈ!!ఎం) ఎం. తిరుమలరావు అధికారులను ఆదేశించారు. శనివారం కార్పొరేట్ ఏరియాలో ఏర్పాటు చేసిన 1.2 మెగావాట్ పీక్ (ఎండబ్ల్యూపి) రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఆయన పరిశీలించారు. ఎపిసెంటర్ భవనంపై ఏర్పాటు చేసిన 70 కిలోవాట్ పీక్ (కేడబ్ల్యూపి) రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్‌ను ప్రత్యేకంగా తనిఖీ చేసి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేట్ ఏరియాలోని మెయిన్ వర్క్‌షాప్‌ను సందర్శించి, అక్కడ సీఎన్సి యంత్రాల ద్వారా వివిధ రకాల కన్వేయర్ రోలర్ల తయారీ, అసెంబ్లింగ్ ప్రక్రియను పరిశీలించారు. అందుబాటులో ఉన్న సీఎన్సీ యంత్రాలను సమర్థవంతంగా, గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. సంస్థ పరిధిలోని అన్ని గనులు, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లు (సీహెచ్పి), సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ల (ఎస్టీపీపీ) అవసరాలకు అనుగుణంగా కన్వేయర్ రోలర్ల డిమాండ్‌ను తీర్చేలా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, నిర్ణీత గడువులో ఉత్పత్తిని పూర్తి చేయాలని అధికారులకు, ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎం (ఈ!!ఎం) డబ్ల్యూఎస్ అండ్ ఈఎం శ్రీనివాసులు, జీఎం (ఈ!!ఎం) సెంట్రల్ వర్క్‌షాప్ రామ్‌మోహన్, ఎస్‌ఓ టు జీఎం (ఈ!!ఎం) కేశవరావు, ఎస్ఈ (ఈ!!ఎం) నరేందర్, ఉమామహేశ్వరరావు, ఏవీ రావు, డీవైఎస్ఈ ఏ. నరేష్‌తో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సీపీఆర్‌తో అత్యవసర వేళల్లో ప్రాణాలు కాపాడొచ్చు

**కొత్తగూడెం ఏరియాలో ఉద్యోగులకు సీపీఆర్‌పై అవగాహన**

**కొత్తగూడెం ఏరియా జీఎం సి.హెచ్. వెంకటరమణ**

**రుద్రంపూర్, ఆగస్టు 8 ప్రభాతవార్త:**



అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని కొత్తగూడెం ఏరియా జీఎం సి.హెచ్. వెంకటరమణ తెలిపారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో శనివారం ఉద్యోగులకు సీపీఆర్ (కార్డియోపల్మనరీ రిససిటేషన్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతకు సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అత్యవసర సమయంలో వైద్య సిబ్బంది వచ్చేలోపు బాధితుడికి ప్రాథమిక సహాయం అందించే విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కార్డియాక్ అరెస్ట్‌ను గుర్తించడం, స్పందన–శ్వాసను పరిశీలించడం, అత్యవసర వైద్య సహాయం కోసం సమాచారం అందించడం, ఛాతీపై కంప్రెషన్స్ చేయడం, అవసరమైన సందర్భాల్లో ఏఈడీ పరికరాన్ని వినియోగించడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఉద్యోగులతో ప్రాక్టికల్‌గా సీపీఆర్ చేయించి, సరైన విధానాన్ని ఎంఆర్‌ఎస్ సిబ్బంది వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో తొలి కొన్ని నిమిషాలు ఎంతో కీలకమని, సరైన సమయంలో సీపీఆర్ అందించడం ద్వారా బాధితుడి ప్రాణాలను నిలబెట్టే అవకాశం ఉంటుందని శిక్షకులు తెలిపారు. ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, ఇన్‌చార్జ్ ఎంఆర్‌ఎస్ అనంతరామయ్య, ఏరియా ఎస్టేట్స్ ఆఫీసర్ బి. తౌర్య, డీవైపీఎం హరీష్, సీనియర్ పీఓ మురళి, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రటరీ సీహెచ్. సాగర్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ కే. సౌజన్య, అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాలలో రక్తవర్గ నిర్ధారణ పరీక్షలు

**లక్ష్మీ మ్రదేవిపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త:**

స్థానిక లక్ష్మీ మ్రదేవిపల్లిలోని వివేక వర్ధిని డిగ్రీ !! పిజీ కళాశాల లో శనివారం నాడు ఎన్ఎస్ఎస్, మైక్రో బయాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో రక్తవర్గ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వీరబాబు ప్రారంభించారు. ఈ శిబిరంలో 300 మంది విద్యార్థిని, విద్యార్థులకు రక్తవర్గ నిర్ధారణ జరిపి తెలియచేయడం జరిగింది. ఈ శిబిరాన్ని ఉద్దేశించి డాక్టర్ వీరబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలని, పరిశుభ్రతతో అనేక రోగాల బారి నుండి దూరం అవుతామని, రక్త వర్గీకరణ తెలిసినట్లయితే ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే రక్తదానం చెయ్యటానికి వీలు అవుతుందని విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని కావున విద్యార్థులు రక్తదానం చెయ్యటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ శిబిరంలో వివేక వర్ధిని విద్యాసంస్థల ఛైర్మెన్ ఎంవీ. చౌదరి, మేనేజింగ్ డైరెక్టర్ ప్రణవ్ కృష్ణ , కళాశాల ప్రిన్సిపల్ సతీష్, డీన్ సాయి కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఏ. మల్లేష్, అకడమిక్ డైరెక్టర్ కిరణ్, ఏవో ప్రవీణ్, మైక్రో బయాలజీ అధ్యాపక బృందం శ్రీధర్,సతీష్, సుధాకర్, బీఏ అధ్యాపకులు బీ. దుర్గ ప్రసాద్, ఎన్ఎస్ఎస్, మైక్రో బయాలజీ విద్యార్థిని, విద్యార్థులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పోలీసుల స్పెషల్ డ్రైవ్ వెహికల్

**నడిపే ప్రతి ఒక్కరు సంతోషంగా ఇంటికి చేరాలి**

**ఔ ఆర్ అండ్ బి రోడ్డుపై ఉన్న షాపులను తొలగించాలి**

**వైరా ఏసిపి సారంగపాణి సిఐ డి మధు**

**బోనకల్, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో విస్తృతంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తూ, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులను గుర్తించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో వైరా ఏసీపీ సారంగపాణి, సర్కిల్ ఇన్స్పెక్టర్ దొంగరి. మధు, బోనకల్ సబ్



ఇన్స్పెక్టర్ మాచినేని రవి, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద వాహనాలను ఆపి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, వాహనదారుల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించడమే స్పెషల్ డ్రైవ్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం,



డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, వాహనాలకు సరైన పత్రాలు లేకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి రోడ్లపై ఉన్న షాపులను తొలగించాలని ఏసిపి. సీఐ లు స్థానిక ఎస్ఐకి చెప్పారు. మండల కేంద్రంలో పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించడంతో వాహనదారులు అప్రమత్తమయ్యారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా ఇకపై కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తామని పోలీసు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై రవి. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# నేటి ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయండి

**బోనకల్, ప్రభాతవార్త :**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి పిలుపు మేరకు ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. మండల కేంద్రంలోని తూము ప్రకాష్ భవన్ విలేకరుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఈ నెల 9న బోనకల్ మండలంలోని మోటమర్రి, రాయన్నపేట, కలకోట, బ్రాహ్మణపల్లి, రాపల్లి గ్రామాల మీదుగా పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. బ్రాహ్మణపల్లిలో మధ్యాహ్న భోజన విరామం అనంతరం యాత్ర రాపల్లి వరకు సాగుతుందని చెప్పారు. ఆగస్టు 13న ఖమ్మం నగరంలో పాదయాత్రతో పాటు ముగింపు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు, పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు



అధిక సంఖ్యలో పాల్గొని ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల నాయకులు కొంగర భాస్కరరావు బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, డిహెచ్పిఎస్ మండల కన్వీనర్ కాకాటి కరుణాకర్, చిరునోముల సిపిఐ గ్రామ కన్వీనర్ గుంపుల జయరాజు పాల్గొన్నారు

# చట్టాలను కార్పొరేట్లకు చుట్టాలుగా మార్చిన మోడీ..

**.మండలంలో కదిలిన ఎర్ర దండు..**

**చింతకాని ప్రభాత వార్త ఆగస్టు 8.**

..దశాబ్ద కాలంగా మోడీ అనుసరిస్తున్న విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ పతనం అంచుకు చేరిందని సిపిఐ జాతీయ సమితి సభ్యుల భాగం హేమంతరావు తెలిపారు ప్రపంచంలో నాలుగవ ఆర్థిక వ్యవస్థ ప్రచారం వెనుక కార్పొరేట్ల ప్రయోజనం దాగుందని ఆయన ఆరోపించారు సిపిఐ జన చైతన్య యాత్రలో భాగంగా శనివారం చింతకాని మండలంలో పలు గ్రామాల్లో యాత్ర నిర్వహించారు చిన్న మండవలో ప్రారంభమైన యాత్ర సీతంపేట, నాగులవంచ,పాతర్లపాడు, ప్రొద్దుటూరు, నాగిలిగొండ కోమట్ల గూడెం, నేరేడ, లచ్చగూడెం చింతకాని, అనంతసాగర్, రామకృష్ణాపురం, బస్వాపురం, రాఘవాపురం, కొదుమూరు, వందనం గ్రామాల్లో సాగింది గ్రామాలలో పాదయాత్రకు ఘనస్వాగతం లభించగా భారీ భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు ర్యాలీలు పాల్గొన్నారు ఈ సందర్భంగా జరిగిన సభలలో భాగం హేమంతరావు మాట్లాడుతూ మోడీ దేశ ప్రజల కోసం కాకుండా కేవలం అదానీ, అంబానీ లాంటి బిలినియర్లు, కార్పొరేట్ సంస్థల కోసమే పాలన సాగిస్తున్నారని ఆయన తెలిపారు దేశ సంపద కొందరి చేతుల్లో పోగుపడుతుందని ఇది భవిష్యత్తులో అత్యంత ప్రమాదకారిగా మారనుందని హేమంతరావు హెచ్చరించారు. చట్టం మోడీ పాలనలో కార్పొరేట్ల చట్టంగా మారిందని ప్రతి చట్టం రద్దు లేదా అమలు వెనుక కార్పొరేట్ల ప్రయోజనాలు దాగియున్నాయని ఆయన తెలిపారు మోడీని సాగనంపకపోతే భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందన్నారు ప్రజలకు దేశంలో రాజకీయ ఆర్థిక సామాజిక పరిస్థితులను వివరించి చైతన్య పరిచేందుకు యాత్రలు చేపట్టినట్లు తెలిపారు రాముడు పేరుతో ప్రజలను వంచిస్తున్న మోడీ తనను విమర్శించే వారిని దేశద్రోహులుగా చూపుతున్నారని హేమంతరావు ఆరోపించారు రాష్ట్రంలో కాంగ్రెస్ చేతలకంటే మాటల ప్రభుత్వంగా మారుతుందని అన్నారు. ఇచ్చిన హామీల విషయంలో ఏ మంత్రి మాట్లాడకపోవడం దీనిని రుజువు చేస్తుందన్నారు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ప్రచారాన్ని శిఖరాగ్రానికి తీసుకెళ్లిన ప్రభుత్వం పేదలను కాదని పైరవీకారులు చెప్పిన వారికే మంజూరీ చేస్తుందని రాజకీయ వివక్ష పాటిస్తుందని హేమంతరావు తెలిపారు కేవలం లబ్ధి చేకూర్చిన అంత మాత్రాన ప్రజలు తమకు ఓట్లు వేస్తారనుకుంటే పొరపాటు అని పార్లల్లోని అన్ని విషయాలను పరిగణలోకి తీసుకుంటారన్నారు చింతకాని మండలంలో




పదివేల కుటుంబాలకు పైగా దళిత బంధు ను బిఆర్ఎస్ పార్టీ మంజూరి చేస్తే 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 6800 మెజార్టీ వచ్చిందని విషయాన్ని ప్రస్తుతం అధికార పార్టీ గుర్తిస్తే మంచిదని పాలన లోపాలను సరిదిద్దుకొని జవాబు దారీగా ఉండాలని హేమంతరావు సూచించారు. కృతజ్ఞతమరిస్తే తగురీతిలో వ్యవహరించక తప్పదని ఆయన హెచ్చరించారు.

***400 హామీలు ఇచ్చి నాలుగు అమలు చేస్తారా...దండి***

ఎన్నికల సందర్భంగా 400కు పైగా హామీలు ఇచ్చి కేవలం నాలుగైదు అమలు చేసి చేతులు దులుపుకుంటారా అని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రశ్నించారు. వివిధ గ్రామాల్లో జరిగిన సభలలో సురేష్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలలో ఉచిత బస్సు మినహా ఏ ఒకటి నెరవేర్చలేదన్నారు. రుణమాఫీ అసంపూర్తిగా



చేశారని తులం బంగారం, రైతు బీమా పంటల భీమా విద్యార్థినిలకు స్కూటీలు మాట ఎత్తటం లేదు అన్నారు వ్యవసాయ రంగానికి సంబంధించి సానుకూల నిర్ణయాల విషయం3లోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు ఇప్పటికైనా ఇచ్చిన హామీల విషయంలో సానుకూలంగా స్పందించకపోతే గత ప్రభుత్వాలకు ఇచ్చిన తీర్పునే కాంగ్రెస్ ఎదుర్కోవాల్సి వస్తుందని సురేష్ హెచ్చరించారు ఇందిరమ్మ ఇండ్ల మంజూరీలో రాజకీయ వివక్ష విడనాడాలన్నారు. ఈ సభలలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి తదితరులు ప్రసంగించగా పలు గ్రామాలలో యాత్రకు సిపిఎం , బిఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు. యాత్రలో రాష్ట్ర సమితి సభ్యులు ఎర్రా బాబు, షేక్ జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణ కుమార్ , అజ్మీరా రామ్మూర్తి జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, రావి శివరామకృష్ణ మెడికంటి చిన్న వెంకటరెడ్డి ఏపూరి రవీంద్రబాబు సిహెచ్ సీతామహాలక్ష్మి, ఏనుగు గాంధీ, పావులూరి మల్లికార్జున్, కూచిపూడి రవి, యంగల ఆనందరావు, సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు జిల్లా సమితి సభ్యులు కన్నెబోయిన విజయమ్మ రాసాల మోహన్ రావు నారపోగు హేమ సర్పంచులు పర్సా రామచంద్రరావు, ఏపూరి పద్మ, ఆవుల నరసింహారావు, కాంపల్లి కోటమ్మ నాయకులు మార్గం శ్రీను దొబ్బల వెంగళరావు,పదిమల వెంకట నరసయ్య గోగుల ఆది, బోళ్ల భాను హుస్సేన్ పుల్లారావు సింగారపు సత్యనారాయణ తుపాకుల సైదులు, జిల్లా ప్రజా సంఘాల బాధ్యులు బత్తినేని నీరజ తాటి నిర్మల పగిడిపల్లి ఏసు నానబాల రామకృష్ణ ఇటికాల రామకృష్ణ మద్దోజు శ్రావణ్ శ్రీనాథ్ రెడ్డి గోపాలరావు కిరణ్ తదితరులు పాల్గొన్నారు




# సొసైటీ నామినేటెడ్ పదవుల్లో సీనియర్ నాయకులకు అవకాశాలు ఇవ్వాలి

**దుమ్ముగూడెం,ఆగస్టు 8 (ప్రభాతవార్త):**



వి ఏ సి ఎ స్ సొసైటీ దుమ్ముగూడెం పాలక మండలిలో సీనియర్ కాంగ్రెస్ నాయకులకే అవకాశం ఇవ్వాలనీ కొత్త వారికి అవకాశం ఇస్తే కార్యకర్తల్లో అభద్రత భావం పెరుగుతుందనీ పలువురు దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పార్టీ దృష్టికి తీసుకువెళ్లారు. దుమ్ముగూడెం మండలం లక్షీ మ్నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సొసైటీలో దుమ్ముగూడెం పాలక మండలి కమిటీలో సీనియర్ కాంగ్రెస్ నాయకులకు మాత్రమే అవకాశం కల్పించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. గత 30,40 సంవత్సరాలుగా పార్టీని నమ్ముకుని ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ సొంత ఖర్చులతో పార్టీని బలోపేతం చేసిన సీనియర్ నాయకుల త్యాగాలను గుర్తించి చైర్మన్, డైరెక్టర్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ కోసం జీవితాలను ధారపోసిన నిజమైన కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా అధిష్టానం ఈ



విషయంలో చాలా ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని నాయకులు స్పష్టం చేశారు. పార్టీలో వ్యతిరేకత, కార్యకర్తల ఆగ్రహానికి అధిష్టానం గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. మండల సీనియర్ నాయకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్నను శుక్రవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. సీనియర్లకే ఈ పదవి దక్కేలా తీర్మానం చేసి తీర్మాన పత్రాన్ని మండల అధ్యక్షుడు తెల్లం హరికృష్ణకు సీనియర్ నాయకులు అందజేశారు. ఈ తీర్మానాన్ని వెంటనే అధిష్టానానికి పంపించి పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిలక వెంకట రమణరెడ్డి, జిల్లా కార్యదర్శి లంక అబ్బులు, శిరపు అప్పలరెడ్డి, జిల్లా మీడియా అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ కనుబుద్ది దేవా, మాజీ మండల అధ్యక్షుడు బైరెడ్డి సీతారామారావు, మాజీ మండల ఉపాధ్యక్షుడు నటరాజ స్వామి, సీనియర్ నాయకులు దర్శి సాంబశివరావు, తోటమళ్ళ సంగీతరావు, కుర్సం మారయ్య, గడ్డం బాలాజీ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్ది ప్రవీణ్, కార్యదర్శి బుర్రి లావణ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కుసిన రవికుమార్, జిల్లా కార్యదర్శి రాయపూడి సుధారాణి, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ వాసం రామ్ కుమార్, సీనియర్ నాయకులు కోడి చంటి, వర్శ చిన్నారావు, పాయం శేఖర్, తిరపతిరావు, పిసోడి మారయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి తరలిరండి

**దుమ్ముగూడెం,ఆగస్టు 8 (ప్రభాతవార్త):**



దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు పార్టీ శ్రేణులు ఆదివాసీలు తరలిరావాలని దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్లం హరికృష్ణ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆగష్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా దుమ్ముగూడెం మండలం లక్షీ మ్నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివాసీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆదివాసీ సంఘం నాయకులు ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని ఆయన కోరారు. ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు వారి హక్కుల సాధనకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హరికృష్ణ అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అందరినీ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

# అడవి తల్లి బిడ్డలు.. అటవీ సంపద రక్షకులు ఆదివాసీలు






**అడవి ఉన్నంతవరకు వీరి చరిత్ర చిరస్మరణీయం..**

**ఆయుర్వేదానికి మూల స్తంభాలు అడవి బిడ్డలు..**

**జల్-జంగల్-జమీన్ కోసం ప్రాణాలర్పించిన మహా వీరుల త్యాగాలు వృథా కాకూడదు..**

**అల్లూరి ధైర్యం... కొమరం భీమ్ ఆత్మగౌరవం...**

**బిర్సా ముండా పోరాట స్ఫూర్తితో కొత్త తరాన్ని తీర్చిదిద్దాలి**

**ఆదివాసిని అయినందుకే అసెంబ్లీలో అడిగి పెట్టా..**

**ఎమ్మెల్యే కోరం కనకయ్య**

**ఆదివాసీలు ఆర్థికంగా.. రాజకీయంగా.. సామాజికంగా ఎదగాలి**

**ఇల్లందు, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

అటవీ సంపద రక్షకులు, ఆయుర్వేదానికి మూల స్తంభాలు ఆదివాసీలు. అడవిలో నివసించే క్రూరమృగాలతో సమానంగా సహజీవనం చేస్తూ వాటి క్రూరత్వాన్ని సైతం మచ్చిక చేసుకుని వాటితో పాటు సమానంగా జీవించే నిష్కల్మషమైన మనస్తత్వం కలిగిన ఆదిమానవుల వారసత్వాన్ని కొనసాగిస్తూ అటవీ సంపద రక్షకులుగా భావితరాలకు పచ్చటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నారు. మానవ రక్షకులుగా ప్రపంచ చరిత్ర ఉన్నంతవరకు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచే ఈ ఆదివాసీల గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా వారి సంస్కృతి, సాంప్రదాయాలు, అటవీ రక్షణ విధానాలు, క్రూర జంతువులతో వారి స్నేహ సంబంధాలను గుర్తు చేసుకుందాం ఇలా... అడవి తల్లి బిడ్డలు ఈ ఆదివాసీలు...ఆదివాసీ అంటే అడవిలో నివసించే వ్యక్తి కాదు... అడవిని కాపాడిన వారసుడు. ఆదివాసీ అంటే వెనుకబడినవాడుకాదు... అన్యాయాన్ని ఎదిరించిన యోధుడు. ఆదివాసీ అంటే బలహీనుడు కాదు... అస్తిత్వం కోసం పోరాడిన మహా వీరుల వారసత్వం. ఆదివాసీ సమాజ చరిత్రను ఒక్కసారి తిరగేస్తే త్యాగాలు, పోరాటాలు, ఆత్మగౌరవం, ప్రకృతి పరిరక్షణతో నిండిన ఎన్నో అధ్యాయాలు కనిపిస్తాయని ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య అన్నారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ సమాజానికి శుభాకాంక్షలు తెలిపిన ఆయన, నేటి తరం తమ మూలాలను తెలుసుకోవడంతో పాటు పూర్వీకుల పోరాట స్ఫూర్తిని అందిపుచ్చుకుని విద్య, ఉపాధి, సాంకేతిక రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. అస్తిత్వం కోసం సాగిన పోరాట కథ“.. ఆదివాసీ సమాజం శతాబ్దాలుగా ప్రకృతితో మమేకమై జీవించిందని ఎమ్మెల్యే అన్నారు. అడవి వారికి కేవలం జీవనాధారం కాదని... అది వారి సంస్కృతి, సంప్రదాయం, ఆహారం, వైద్యం, జీవన విధానంతో ముడిపడినదని గుర్తుచేశారు.ప్రకృతిని కాపాడుతూ, తరతరాలుగా అడవులపై ఆధారపడి జీవిస్తూ వచ్చిన ఆదివాసీ సమాజం నుంచి దేశానికి ఎంతో విలువైన సంప్రదాయ జ్ఞానం అందిందన్నారు.అడవులను కాపాడిన సమాజాన్ని వెనుకబడిన సమాజంగా చూడకూడదు. ప్రకృతితో కలిసి ఎలా జీవించాలో ప్రపంచానికి నేర్పిన సమాజంగా ఆదివాసీ సమాజాన్ని గౌరవించాలి అని కోరం కనకయ్య అన్నారు. కొమరం భీమ్... “జల్-జంగల్-జమీన్“కు జీవం పోసిన యోధుడు..తెలంగాణ ఆదివాసీ చరిత్రలో కొమరం భీమ్‌కు ప్రత్యేక స్థానం ఉందని ఎమ్మెల్యే అన్నారు.గోండు ఆదివాసీల హక్కులు, గౌరవం, జీవన విధానం కోసం పోరాడిన కొమరం భీమ్ పేరు తెలంగాణ నేలపై చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. జల్... జంగల్... జమీన్... అనే భావన ఆదివాసీ జీవన హక్కులతో ఎంతగా ముడిపడి ఉందో భీమ్ పోరాటం తెలియజేస్తుందన్నారు. రాణి దుర్గావతి... వీరత్వానికి మహిళా ప్రతీక..ఆదివాసీ చరిత్రలో మహిళల పాత్ర కూడా అపారమైందని ఎమ్మెల్యే గుర్తుచేశారు.గోండు రాజ్యాన్ని పరిరక్షించేం దుకు ధైర్యంగా పోరాడిన రాణి దుర్గావతి మహిళా నాయకత్వానికి గొప్ప ఉదాహరణగా నిలిచారని పేర్కొన్నారు. ఆదివాసీ మహిళ కేవలం కుటుంబాన్ని నడిపించేది కాదు... అవసరమైతే సమాజం కోసం పోరాడే శక్తి కూడా ఆమెకు ఉందిఅని అన్నారు. నేటి ఆదివాసీ మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, ప్రజాసేవ వంటి రంగాల్లో మరింత ముందుకు రావాలని కోరారు.తిల్కా మాంఝీ... సిద్ధూ-కాన్హూ... గైడిన్ల్యూ... పోరాటాల పరంపర..ఆదివాసీ పోరాట చరిత్రలో తిల్కా మాంఝీ, సిద్ధూ-కాన్హూ, రాణి గైడిన్ల్యూ వంటి అనేక మంది వీరులు తమ ప్రజల హక్కుల కోసం పోరాడారని ఎమ్మెల్యే అన్నారు.వారి జీవితాల్లో ఒకే సందేశం కనిపిస్తుందని పేర్కొన్నారు.అన్యాయాన్ని సహించకూడదు..హక్కులను వదులుకోకూడదు...అస్తిత్వాన్ని కాపాడుకోవాలి...ప్రజల కోసం నిలబడాలి ఈ విలువలను నేటి తరం జీవితంలో ఆచరించాలని ఆయన సూచించారు.మహా వీరుల చేతుల్లో ఆయుధాలు ఉంటే... మన పిల్లల చేతుల్లో పుస్తకాలు ఉండాలి. న్యాయవాదులు, ఉపాధ్యాయులు, అధికారులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులుగా ఆదివాసీ యువత మరింతగా ఎదగాలని ఆకాంక్షి ంచారు. మన పిల్లలు ఎవరికీ తీసిపోరు. వారికి అవకాశాలు ఇవ్వాలి. వారిలో ఆత్మవిశ్వాసం నింపాలి. చదువుకు ప్రోత్సహించాలి. ఇల్లందు గడ్డతో ఆదివాసీ సమాజానికి విడదీయరాని బంధం..ఇల్లందు నియోజకవర్గానికి ఆదివాసీ సమాజంతో చారిత్రక, సామాజిక అనుబంధం ఉందని ఎమ్మెల్యే అన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, ఉపాధి, మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంతో పోటీ పడాలి..ఆదివాసీ అభివృద్ధి అంటే వారి మూలాలను వదిలేయడం కాదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఆదివాసీ భాషలు, పాటలు, నృత్యాలు, పండుగలు, సంప్రదాయాలు, కళలు, ప్రకృతి ఆధారిత జ్ఞానాన్ని భావితరాలకు అందించాలని సూచించారు. అదే సమయంలో ఆధునిక విద్య, సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ ప్రపంచం, కొత్త ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. మూలాలను కాపాడుకుంటూ...అల్లూరి చూపిన ధైర్యం మనలో ఉండాలి... కొమరం భీమ్ చూపిన ఆత్మగౌరవం మనలో ఉండాలి... బిర్సా ముండా చూపిన పోరాట స్ఫూర్తి మనలో ఉండాలి. రాణి దుర్గావతి చూపిన నాయకత్వం మన మహిళల్లో ఉండాలి. కానీ నేటి పోరాటానికి మన ఆయుధం విద్య. మన బలం ఐక్యత. మన లక్ష్యం అభివృద్ధి. మన గమ్యం ఉన్నత శిఖరాలు.ఆదివాసీ సమాజం ఇక వెనుకబడకూడదు..గతంలో పోరాడిన సమాజం.. .నేడు చదువుకోవాలి.నేడు ఎదగాలి.రేపు నాయకత్వం వహించాలి.ప్రతి ఆదివాసీ బిడ్డ పాఠశాలకు వెళ్లాలి. ప్రతి యువకుడు ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకోవాలి. ప్రతి మహిళ ఆత్మగౌరవంతో ముందుకు సాగాలి. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడాలి. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి. అడవులను కాపాడిన పూర్వీకుల వారసత్వాన్ని నిలబెట్టుకుంటూ, హక్కుల కోసం పోరాడిన మహా వీరుల స్ఫూర్తిని కొనసాగిస్తూ విద్యను ఆయుధంగా చేసుకుని, సాంకేతికతను అందిపుచ్చుకునిఆర్థికంగా బలపడుతూఆదివాసీ సమాజం ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు.

# ఇసుక లారీల రద్దీతో స్తంభిస్తున్న రహదారి

**ప్రయాణికులకు తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు**

**ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు కృషి అభినందనీయం**



**పినపాక,ప్రభాతవార్త,ఆగస్టు 08**

నిత్యం ఇసుక ర్యాంపులకు వస్తున్న వందలాది ఇసుక లారీలతో మణుగూరు నుంచి ఏడూబ్బయ్యారం,జానంపేట, దుగినేపల్లి వరకు ప్రధాన రహదారి ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల కు గురవుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరాయంగా కొనసాగుతున్న ఇసుక లారీల రవాణా కారణంగా సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకం గా ఉదయం, సాయంత్రం సమయంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుంది. రహదారి ఇరుకుగా ఉండటం వల్ల భారీ లారీలు ఎదురె దురుగా వచ్చినప్పుడు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ఉద్యోగులు, విద్యార్థులు, రోగులు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. అత్యవసర సేవలకు సైతం ఆటంకం కలుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పోలీసుల కృషి అభినంద నీయం ఇసుక లారీల వలన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురైన ప్రతి సారీ సమస్యను పరిష్కరించి ట్రాఫిక్ నియంత్రణ చేయడంలో ఏడూళ్ల బయ్యారం పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి ఆదేశాలతో ఏడుళ్ల బయ్యారం సిఐ వెంకటేశ్వరావు,ఎస్ఐ సురేష్ లు ట్రాఫిక్ నియంత్రణ కోసం అదనపు సిబ్బందిని మోహరించడం, లారీలను రోడ్డుపై నిలిపివేయకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టడం వంటి చర్యలు అమలు చేస్తున్నారు.కఠిన పరిస్థితుల్లో పోలీసులు నిబద్ధతగా విధులు నిర్వహిస్తున్నారు.అయితే తాత్కాలిక చర్యలతో సమస్య పూర్తిగా తగ్గడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఇసుక రవాణాకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయడం, రహదారి విస్తరణ చేపట్టడం, లారీలకు కచ్చితమైన టైమ్ స్లాట్లు అమలు చేయడం,ఇసుక ర్యాంపులలో పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయడం వంటి శాశ్వత పరిష్కారాలను సంబంధిత అధికారులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



# కమలాపురం గ్రామంలో పారిశుధ్య పనులు

**మురికి నీరు బురద ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్**

**వార్త ప్రభావం**

**కారేపల్లి ఆగస్టు 8ప్రభాతవార్త**

సింగరేణి మండలం కమలాపురం పంచాయతీలో శనివారం పారిశుధ్య పనులు నిర్వహించారు. వార్త దినపత్రికలో ప్రచురితమైన అధ్వాన్నంగా మారిన పారిశుధ్యం శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో బురద ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతోపాటు వరద నీరును తొలగించారు. గ్రామంలో ప్రధానంగా రహదారి మార్గాలకు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో సీసీ రహదారులపైనే వరద నీరు నిలుస్తుంది. అదేవిధంగా గ్రామంలో పెంట కుప్పలు రహదారి పక్కనే ఉండడంతో ఇబ్బందికరంగా మారింది. అధికారులు చొరవ చేసుకొని గ్రామంలో రహదారుల వెడల్పు పెంచడం తోపాటు డ్రైనేజీ లకు నిధులు మంజూరు చేస్తే గ్రామస్తులకు వర్షాకాలంలో పడుతున్న ఇబ్బందులు తొలగిపోతాయి. లేకపోతే ప్రతి సంవత్సరం గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

# తెలంగాణలో ఫేక్ సర్టిఫికెట్లతో లెక్చరర్లుగా చలామణి

**35 మంది జూనియర్ లెక్చరర్ల గుట్టు రట్టు**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా లో నలుగురు గుర్తింపు**

**షోకాజ్ నోటీసులు జారీ చేసిన ఇంటర్ బోర్డు**

**35 కాదు 600 మంది ఉన్నారంటున్న అర్హత కలిగిన జూనియర్ లెక్చరర్లు**

**మధిర ఆగస్టు 8 ప్రభాతవార్త**

ఎంతోకాలంగా తమకు అన్యాయం జరిగిందంటూ ఉమ్మడి రాష్ట్రంలో జూనియర్ లెక్చరర్లుగా విధుల్లో చేరిన అన్ని అర్హతలు కలిగిన లెక్చరర్లు ప్రభుత్వాలకు కోర్టులకు తమ గోడు గడిచిన పదేళ్లుగా వినిపిస్తూనే ఉన్నారు. గత పాలకులు ఈ అంశాన్ని అసలు పట్టించుకోకపోగా, రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రజా ప్రభుత్వం లోనైనా తమకు న్యాయం జరుగుతుందంటూ ప్రస్తుతం ప్రభుత్వ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్లుగా విధులు నిర్వహిస్తూ రెగ్యులరైజేషన్కు అన్ని అర్హతలు ఉండి అన్యాయం అయిపోయిన అధ్యాపకులు తమ ఆవేదనలను కలిసిన మంత్రులకు ముఖ్యమంత్రి కి విన్నత్తులు చేస్తూనే ఉన్నారు. వీరి గోడు కు కొంతమేర ఊరట లభించేలా ఎట్టకేలకు విద్యాశాఖ రెగ్యులరైజేషన్ పొంది విధులు నిర్వహిస్తూ వస్తున్న జూనియర్ లెక్చరర్ల అర్హతల పై దృష్టి సారించింది. దీనిలో భాగంగారాష్ట్రంలోని పలు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నకిలీ సర్టిఫికెట్లతో విధుల్లో చేరిన 35 మంది జూనియర్ లెక్చరర్ల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విద్యాశాఖ నిర్వహించిన తనిఖీలు, పరిశీల నలో వీరి సర్టిఫికెట్లు ఫేక్ గా తేలాయి. వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న ఈ లెక్చరర్లు ఫేక్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఉద్యోగాలను పొందినట్లు అధికారులు గుర్తించారు. వీరంతా ఇతర రాష్ట్రాల్లోని యూనివర్శిటీల నుంచి పీజీ సర్టిఫికెట్లు పొందినట్లు తేల్చారు. ఈ క్రమంలోనే తెలంగాణ ఇంట ర్మీడియట్ బోర్డు వీరికి తాజాగా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వారంలోగా వివరణ ఇవ్వాలని, సమాధానాల ఆధారంగానే చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నలుగురు గుర్తింపు నకిలీ సర్టిఫికెట్లతో రెగ్యులర్ జూనియర్ లెక్చరర్గా విధులు నిర్వహిస్తున్న వారిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురికి విద్యాశాఖ నోటీసులు జారీ చేసింది. వీరిలో మధిరలో పనిచేస్తున్న జి.కృష్ణ (సివిక్స్)వైరాలో పనిచేస్తున్న షేక్ రోషన్ బి (హిందీ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాకలో పనిచేస్తున్న పి. యాకయ్య (ఫిజిక్స్) అశ్వరావుపేట లో పనిచేస్తున్న చాంద్ పాషా (హిందీ) ఉన్నారు. 35 మంది జూనియర్ లెక్చరర్లు వీరే.. 1.ఎస్. రవీందర్ (ఇంగ్లీష్ నిర్మల్ జిల్లా ఖానాపూర్ జూనియర్ కాలేజీ)2.పి. తిరుపతి (మ్యాథ్స్ సిరిసిల్ల జిల్లా చందుర్తి కాలేజీ)3.ఎం.శంకరయ్య (ఇంగ్లీష్ సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట)4.ఎం.రమాకాంత్ (ఎంఈటీ నాగర కర్నూల్ జిల్లా కల్వకుర్తి)5.జె. రవీందర్ రావు (ఇంగ్లీష్ నిజామాబాద్ జిల్లా మల్లూర్)6.ఎస్.సుధాకర్ (ఇంగ్లీష్ పెద్దపల్లి జిల్లా ధర్మారం)7.ఎ.రాజు (సివిక్స్ సిరిసిల్ల జిల్లా రుద్రంగి)8.పి.శ్రీనివాస్ (ఇంగ్లీష్ సిరిసిల్ల జిల్లా కోనరావుపేట)9.వి.శ్రీనివాస్ (ఫిజిక్స్ ధర్మారం జిల్లా పెద్దపల్లి)10.ఎండీ అష్రఫ్ హుస్సేన్ (ఈసీటీ సిద్దిపేట జిల్లా గజ్వేల్ (బాలురు)11.ఎస్.కృష్ణ (ఇంగ్లీష్ సిరిసిల్ల జిల్లా రుద్రంగి)12.ఎల్.పరశురాములు(మ్యాథ్స్ సిద్దిపేట్ జిల్లా చేర్యాల)13.ఎన్.రాజేందర్ (కెమిస్ట్రీ పెద్దపల్లి జిల్లా గోదావరిఖని (బాలికలు)14.జి.ప్రసాద్ (కెమిస్ట్రీ సిద్దిపేట జిల్లా చిన్నకోదూరు)15.బి.లలిత (సీటీ సూర్యాపేట జిల్లా సూర్యాపేట)16.బి.సంతోష్ రెడ్డి (జువాలజీ సంగారెడ్డి జిల్లా కల్హేర్)17.సి.రవీందర్ (సీటీ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం)18.సీహెచ్ నారాయణ (మ్యాథ్స్ మహబూబాబాద్ జిల్లా గార్ల)19.సీహెచ్ నరేందర్ (బోటనీ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల)20.జి.మమత (ఇంగ్లీష్ కరీంనగర్ జిల్లా కరీంనగర్(బాలికలు) 21.జె.మల్లేశం (కామర్స్ సంగారెడ్డి జిల్లా జోగిపేట)22. కె.అనసూయ (బోటనీ నిర్మల్ జిల్లా దిలావర్పూర్)23.కె. తిరుపతి (ఇంగ్లీష్ కరీంనగర్ జిల్లా జమ్మికుంట)24.చాంద్ పాషా (హిందీ కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట)25.పి.రమాదేవి (సీటీ వికారాబాద్ జిల్లా తాండూర్)26.పి.యాకయ్య (ఫిజిక్స్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక)27.ఎన్.బాలమల్లు (ఇంగ్లీష్ జగిత్యాల జిల్లా బీర్పూర్)28.జి.కృష్ణ (సివిక్స్ ఖమ్మం జిల్లా మధిర)29.ఎం.రత్నకుమారి (సీటీ సూర్యాపేట జిల్లా కోదాడ)30.ఖాజా జఫరుద్దీన్ (ఫిజిక్స్ నల్గొండ జిల్లా నల్గొండ (బాలికలు)31.బి.రమేశ్ (జువాలజీ సిరిసిల్ల జిల్లా కోనరావుపేట)32.షేక్ రోషన్ బీ (హిందీ ఖమ్మం జిల్లా వైరా)33.ఆర్.సరిత (ఎకనామిక్స్ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం)34.బి.రాజాబాబు (ఇంగ్లీష్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం)35.పి.అశోక్ (సివిక్స్ కుమరం భీం జిల్లా కౌటాల) 35 మంది కాదు 600 మంది: ఆనంద్ (జూనియర్ లెక్చరర్)రాష్ట్రంలో అనర్హతలతో సుమారు 600 మంది జూనియర్ లెక్చరర్లుగా వివిధ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారని వీరందరిపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలని జూనియర్ లెక్చరర్ గా విధులు నిర్వహిస్తున్న ఆనంద్ ప్రభుత్వాన్ని కోరారు. విద్యాశాఖ దృష్టికి అనేక తాము విన్నపాలు చేసినప్పటికీ స్పందన లభించలేదని, ప్రస్తుతం చేసిన విచారణ లో తమ ఆవేదనలకు స్పందన లభించిందని భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**వర్షాకాలం అంటేనే..సీజనల్ వ్యాధులకు చిరునామా..**

**వర్షాకాలం వ్యాధులతో జాగ్రత్త..**

**పరిసరాల పరిశుభ్రత ప్రధానం.**

**అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యాధికారి.. డాక్టర్ నంద్యాల బాలకృష్ణ**



**ఏన్కూరు,ఆగస్టు 08, ప్రభాతవార్త**

అడపాదడపా కురిసే వర్షాలతో వచ్చే కొత్త నీరు..లోపించే పారిశు ద్ధంతో వివిధ రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది.ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి.తాగునీరు కలుషితంతో జ్వరము..దగ్గు..జలుబు..ఒళ్లు నొప్పులు..తల నొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. ప్రధానంగా వర్షపు నీటి నిలు వతో దోమలు వృద్ధి చెందుతాయి.అవి డెం గ్యూ..మలేరియా టైఫాయిడ్.. డయేరియా.. తదితర వ్యాధులకు సంబంధించిన వైరస్ లు..బ్యాక్టీరియాల వ్యాప్తికి తోడ్పడడంతో జ్వరాలు విజృంభించే అవకాశాలు ఉన్నాయి.వర్షాకాలము అంటేనే వ్యాధులకు చిరునామా అని.. వానలు రాకతో పాటు అనేక రకాల సీజనల్ వ్యాధులు తరుము కొస్తాయని జర భద్రం సుమా అంటూ..సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒకరు అప్రమత్తముగా ఉండాలని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నం ద్యాల బాలకృష్ణ హెచ్చరిస్తున్నారు.మండల కేంద్రమైన ఏనుకూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికా రి డాక్టర్ నంద్యాల బాలకృష్ణ విలేఖరులతో మాట్లాడుతూ..వర్షపు నీళ్లు స్వ చ్ఛమైన..నేల మీదకు వచ్చాక కలుషి తమవుతాయని..నీటి కలుషితం వల్ల అనేక వ్యాధులు ప్రభలు తాయని..తొలుత తుమ్మడంతోనే ఆరోగ్య సమస్య లు ఆవహిస్తాయని వీటి పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు సూచిస్తున్నారు.

**డయేరియా..అతిసార :**

కలుషిత మైన నీటిని త్రాగడం వలన ఈ వ్యాధులు ప్రభలు తాయని..విరోచనాలు కావడం ఈ వ్యాధి ప్రధాన లక్ష ణం వాంతులు..విరోచనాలు ఉండే స్థితినే డయేరియా అంటారు.ఇది చిన్న పిల్లలకు ఎక్కువగా వస్తుంది.శరీరంలో నీటి శాతం తగ్గడం వల్ల బాగా నిరసన పడిపోతారని..చిన్నప్రేగుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వల్ల అతి సారం వ స్తుందని..ఈ వ్యాధి ప్రబలిన వారికి నోటి ద్వారా సోడియం లవణాన్ని..గ్లూకోజ్ ను ఇచ్చి వ్యాధి నిరోధక శక్తిని పెం చుకోవచ్చని అన్నారు.

**మలేరియా :**

రోజు విడిచి జ్వరం రావడం..తలకాయ నొప్పి..చలి పెట్టడం..వాంతులు అవడం ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు.ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి దోమ కాటు ద్వారా వ్యాపిస్తుందని. .దోమల నివారణకు దోమతెరలు వాడాలని..ప రిసరాల పరిశుభ్రత..ఎయిర్ కూలర్ లో నీటిని మార్చడం చేయాలని అన్నారు.

**టైఫాయిడ్ :**

ఈ వ్యాధి సోకిన వ్యక్తికి రెండు..మూడు వారాలు హెచ్చుతగ్గుల జ్వరం వస్తుందని.. ఇది అత్యంత ప్రమాదకరమైన జ్వరం..జ్వరం తగ్గి మళ్ళీ తిరగబడితే డబల్ టైఫాయిడ్ గా పేర్కొంటున్నారు.ఇది దోమల వలన వస్తుంది. టైఫాయిడ్ క్రిములు..రోగి వి రోచనంలోనూ.. మూత్రంలోనూ విసర్జన అవుతాయని..ఈగలు వాలిన పదార్థాలు తినడం వల్ల ఈ వ్యాధి ప్రభలుతుందని..ఆహార పానీయాల విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని.. చేతులను డె టాల్.. వేడి నీళ్లతో కడుక్కోవాలి అని సూచి స్తున్నారు.డెంగ్యూ జ్వరం :ఏడిఎస్ ఈజిప్ట్ అనే ఒక రకమైన వైరస్ దోమ కారణంగా ఈ డెంగ్యూ వ్యాధి వస్తుం దని..ఈ వ్యాధి సోకిందని తె లుసుకోవడానికి ఐదు నుంచి పది రోజులు పడుతుందని..తలనొప్పి..చలి పెట్టడం..శరీరం వేడెక్కడం..కండ్రాల నొ ప్పులు..వెన్ను..కీళ్ల నొప్పులు..ఈ వ్యాధి లక్షణాలు అని..పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నా రు.పాత డ్రమ్ములు..పూల కుండీలు..పాత టైర్లు..కొబ్బరి చిప్పలు పగిలిన..నీటి తొట్టెల్లో వైరస్ దోమలు ఎక్కువగా ఉంటాయి.

**మెదడువాపు :**

పందులకు కుట్టిన దోమలు తిరిగి..మనుషులను కుట్టడం..వల్ల ఈ వ్యాధి ప్రబలు తుందని..ఈ వ్యాధి ఎక్కువగా ఏడాది నిండిన..14 ఏళ్ల వయసు లోపే వారికి వస్తుందని.. జ్వరము..కళ్లు తిరగడం.. వాంతులు..విరోచనాలు..శరీ రం మెలికలు తిరిగి కొట్టుకోవడం ఈవ్యాధి లక్షణాలు అని..ఈ వ్యాధి సోకకుండా ఉండాలంటే..దోమలు కుట్టు కుం డా జాగ్రత్తలు పడాలన్నారు.

**ఆస్తమా..నిమోనియా :**

వర్షాకాలంలో చలితేమ ఎక్కువగా ఉండటంవల్ల ఈ వ్యాధులు ప్రబలు తాయని..ఉ బ్బసం ఉన్న రోగులు..ఈ కా లంలో జాగ్రత్తగా ఉండాలని..అలర్జీ కలిగించే వస్తువులు ఇంట్లో లేకుండా చూసుకోవాలని..ఉలెన్ దుస్తులు ధరించాలని..కూల్ డ్రింక్స్..ఐస్ క్రీములకు దూరంగా ఉండాలన్నారు.పిల్లలకు నిమోనియా వచ్చే అవకాశం ఉందని..ఈ వ ర్షాకాలంలోనే ఎక్కువగా అలర్జీలు..వల్ల సైనసైటిస్ సైతం తీవ్రమవుతుందని అన్నారు.పరిసరాల పరిశుభ్రత ప్రధానం : వర్షాకాలంలో ఆరోగ్య సమస్యలు దరిచేరకుండా ఉండాలంటే..మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని..ఈ గలు. దోమలు విషయంలో ప్రధాన జాగ్రత్తలు తీసుకో వాలని..రోజు పెనాయిల్..నీటితో గదులుశుభ్రం చేసుకోవాలని.. వేడివేడి పదార్థాలు మాత్రమే తీసుకోవాలని.. నిల్వఉన్న ఆహార పదార్థములను తినకూడదని, మాంసాహారం తినడం తగ్గించాలని..వీధులలో రోడ్ల పక్కన ఉండే పానీయాలు..ఆహార పదార్థములను తీసుకోకూడదని..ఇంట్లో నీటిని మరిగించి తాగాలని అన్నారు.జీర్ణశక్తిని కాపాడుకోవడానికి జీర్ణమయ్యే పదార్థాలు తినాలని..ఇంట్లో శారీరక వ్యాయామం చేయడం మంచిదని అన్నారు.

# ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**-హక్కులు, అస్తిత్వం, సంస్కృతి పరిరక్షణకు ఐక్యంగా కదలాలి**

**-ఆగస్టు 9న భద్రాచలంలో ర్యాలీ.. సాంస్కృతిక కార్యక్రమాలు**

**భద్రాచలం, ఆగస్టు 8 (ప్రభాతవార్త):**



ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాలు, భాష, జీవన విధానాల పరిరక్షణకు ప్రతీకగా నిలిచే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు 9న భద్రాచలంలో ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక పిలు పునిచ్చింది. భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో పట్టణంలోని ఆదివాసీ ప్రజానీకం, యువత, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వేదిక ప్రతినిధులు కోరారు.ఆదివాసీ సమాజం ఎదుర్కొం టున్న సమస్యలను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, హక్కులు, అభివృద్ధి, అస్తిత్వం, సంస్కృతి పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం కీలక వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఆదివాసీ సమాజ ఐక్యతను చాటుతూ తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

**-ఉదయం 9 గంటలకు ర్యాలీ**

ఆగస్టు 9న ఉదయం 9 గంటలకు భద్రాచలం అంబేద్కర్ సెంటర్లోని ఆదివాసీ అమరవీరులు అల్లూరి సీతారామరాజు, ఘాం గంటన్న దొర, ఘాం మల్లు దొర విగ్రహాలకు నివాళులర్పించడంతో వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం జెండా ఆవిష్కరణ, గీతాలాపన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అక్కడి నుంచి బ్రిడ్జి సెంటర్ మీదుగా ర్యాలీగా బయలుదేరి పాత మార్కెట్ సెంటర్లోని రాణి దుర్గావతి, కొమరం భీమ్ విగ్రహాలకు నివాళులర్పిస్తూ ఐటీడీఏ గిరిజన భవన్ వరకు ర్యాలీ కొనసాగుతుందని వెల్లడించారు.

**-ఐటీడీఏ రోడ్డుకు ఎర్రయ్యరెడ్డి పేరు**

ర్యాలీ అనంతరం ఐటీడీఏ రోడ్డుకు మాజీ ఎమ్మెల్యే ముర్ల ఎర్రయ్యరెడ్డి పేరు నామకరణం చేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజన అభివృద్ధి అంశాలపై సమావేశం నిర్వహించనున్నారు.

**-ప్రముఖుల హాజరు**

కార్యక్రమానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, టీఎస్ఎఫ్డీసీ చైర్మన్ పొదెం వీరయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్, సబ్కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, డీఎస్పీ అరుణ్కుమార్, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారని తెలిపారు.ఆదివాసీ సమాజానికి చెందిన ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములై అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు కోరారు. వేదిక కన్వీనర్ తెల్లం రమణయ్య, కోకన్వీనర్ ముర్ల రమేష్రెడ్డి, కుంజా ధర్మారావు, గుండు శరత్, పూనెం వీరభద్రం, జగ్గా పుల్లయ్య, ఇర్పా అనసూయ, వీసాల కృష్ణయ్య, కుంజా రమాదేవి, కొండ్రు సుధారాణి, వర్ష వసంత్, కొండ్రు వీరస్వామి, కుంజా సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకలు

**పినపాక, ప్రభాత వార్త, ఆగస్టు 8**

ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం, జల్-జంగల్-జమీన్ కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలను సాధించేందుకు ఆదివాసీ సంఘాలు నిరంతరం కృషి చేయాలని తెలంగాణ ఆదివాసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి రవికుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పినపాక మండలంలోని ఇబయ్యారం క్రాస్‌రోడ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల అధ్యక్షులు దుబ్బ గోవర్ధన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పాక బ్రిడ్జి నుంచి ఇ బయ్యారం క్రాస్ రోడ్ వరకు ఆదివాసీలు భారీ ర్యాలీ నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించిన ఆదివాసీలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. సంప్రదాయ కొమ్ము వాయిద్యాలను వాయిస్తూ, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ర్యాలీ కొనసాగింది. ఆదివాసీ హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని నినాదాలు చేశారు. అనంతరం ఇబయ్యారం క్రాస్‌రోడ్‌లోని కొమురం భీమ్ విగ్రహం వద్ద ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. కొమురం భీమ్‌తో పాటు ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయులను స్మరించుకున్నారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా బండారి రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కేవలం ఒకరోజు వేడుకగా నిర్వహించి ముగించకూడదని అన్నారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. వారి ఆశయాలను సాధించేందుకు ఆదివాసీ సంఘాలు, నాయకులు, యువత నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీలకు భూమి, అడవి, సహజ వనరులతో ఉన్న అనుబంధం ఎంతో పురాతనమైనదన్నారు. జల్, జంగల్, జమీన్‌పై ఆదివాసీలకు ఉన్న హక్కుల పరిరక్షణ కోసం అనేక మంది మహనీయులు పోరాటాలు చేశారని గుర్తు చేశారు. వారి పోరాటాల ఫలితంగా ఆదివాసీ సమాజానికి హక్కులపై అవగాహన పెరిగిందన్నారు. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భూమి హక్కులు, అటవీ హక్కులు, విద్య, వైద్యం, ఉపాధి, రహదారులు, తాగునీరు, సాగునీరు వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి ఆదివాసీ సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ యువత విద్యతో పాటు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ప్రాముఖ్యతను బండారు రవికుమార్ వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీ ప్రజల హక్కులు, వారి సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు, జీవన విధానాలను పరిరక్షించాల్సిన అవసరాన్ని గుర్తుచేసే రోజుగా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివాసీల ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుత తరానికి ఆదివాసీ చరిత్రను తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కొమురం భీమ్ వంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కేవలం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించడం మాత్రమే కాకుండా, వారు కలలు కన్న సమాజ నిర్మాణం కోసం కృషి చేయడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అమరులైన మహనీయుల ఆశయ సాధన కోసం ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని రవికుమార్ సూచించారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఆదివాసీ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దుబ్బ గోవర్ధన్, జిల్లా నాయకులు మడివి రమేష్, కంతారావు, సర్పంచ్ బాపనమ్మ తో పాటు ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, గ్రామాల నుంచి వచ్చిన ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## ప్రపంచ ఆదివాసీ దినోత్సవం శుభాకాంక్షలు: ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 08:**



ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆయన శనివారం విలేకరుల తో మాట్లాడారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ ఆదివాసీ ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అడవిని, ప్రకృతిని కాపాడుకుంటూ తమ సంస్కృతి, సంప్రదాయాలు, భాషలను తరతరాలుగా పరిరక్షిస్తున్న ఆదివాసీలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఆదివాసీ కుటుంబానికి అందేలా చూడటమే తన లక్ష్యమని, అందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## మతోన్మాదులకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలి



**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 08:**

మతోన్మాదులకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు మరియు ప్రజలందరూ ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. సోమవారం మణుగూరులో నిర్వహించిన మున్సిపల్, హమాలి కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నయా ఉదారవాద సంస్కరణలను దూకుడుగా అమలు చేస్తోందని ఆయన విమర్శించారు. పెట్టుబడిదారులకు గరిష్ట లాభాలు చేకూర్చేందుకే తరతరాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని ఆరోపించారు. పని గంటలను 8 గంటల నుండి 12 గంటలకు పెంచుకునే స్వేచ్ఛను యాజమాన్యాలకు ఇచ్చారని, సమ్మె హక్కును కాలరాస్తూ తీవ్ర ఆంక్షలు విధించారని మండిపడ్డారు. విద్యుత్ సవరణ బిల్లు 2025, నూతన విత్తన చట్టాలను తెస్తూ రైతాంగాన్ని, కార్మికులను దగా చేస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, ఐకేపీ వివోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు వంటి స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు కల్పించకుండా వారి సంక్షేమాన్ని గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. హక్కుల సాధన కోసం లేబర్ కోడ్‌లను రద్దు చేసేవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు సత్రపల్లి సాంబశివరావు, మండల కన్వీనర్ కొడిశాల రాములు, రైతు సంఘం మండల కార్యదర్శి బొల్లం రాజు, పల్లపు నాగేశ్వరరావు, ఆర్. శ్రీను, బూర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పగిడేరులో దోమల నివారణకు స్ప్రేయింగ్

**మణుగూరు, ప్రభాత వార్త, ఆగస్టు 08:**



ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పగిడేరు గ్రామంలో శనివారం మొదటి విడత దోమల మందు పిచికారీ (స్ప్రేయింగ్) కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ దోమల మందును చల్లించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమల లార్వా అభివృద్ధి చెందకుండా యాంటీ లార్వా మందులను పిచికారీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దోమల మందును వినియోగించుకోవాలని, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంజా శ్రవణ్ కుమార్, అసిస్టెంట్ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు, సిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మణుగూరులో అరుదైన శస్త్రచికిత్స

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 08:**



పట్టణంలోని స్ప్రింగ్ హాస్పిటల్‌లో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సంఘమిత్ర ఆధ్వర్యంలో శనివారం ఒక మహిళకు అరుదైన ఆపరేషన్ నిర్వహించి, రెండు కేజీల కణితిని విజయవంతంగా తొలగించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్‌కు చెందిన డి.పద్మ అనే మహిళ తీవ్ర కడుపునొప్పితో ఆస్పత్రిలో చేరగా వైద్య పరీక్షల అనంతరం ఈ శస్త్రచికిత్స చేశారు. భద్రాచలానికి చెందిన సీనియర్ వైద్యులు డాక్టర్ సోమయ్యతో కలిసి డాక్టర్ సంఘమిత్ర ఈ ఆపరేషన్‌ను పూర్తి చేశారు. బాధితురాలు పద్మ, ఆమె భర్త నాగేశ్వరరావు వైద్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు అభినందనలు



**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 08:**

మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ముదిగొండ రామకృష్ణను సిద్దార్థ కాలేజీ ప్రిన్సిపాల్ వల్లభనేని అజయ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం కళాశాల సిబ్బంది, సుమారు 100 మంది విద్యార్థులు శనివారం ఆసుపత్రిలో కలసి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 08:**

ఈ నెల 15 న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లనూ పకడ్బందీగా పూర్తి చేయాలని మణుగూరు ఏరియా జీఎందుర్గం రామచందర్ అధికారులను ఆదేశించారు. శనివారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఓ టు జీఎం డి. వెంకటరామారావు, ఏజెంట్ కొండాపురం వేణు మాధవ్, ఏజీఎంలు ఎస్. రమేష్, సీహెచ్. రాంబాబు, ఏరియా ఇంజినీర్ వి. మదన్ నాయక్, వివిధ విభాగాల డీజీఎంలు, వైద్య, భద్రతా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారుల చిరునవ్వే లక్ష్యం.. విద్యాభివృద్ధికి చేయూత



**ఇల్లందు, ఆగస్టు 9, ప్రభాతవార్త:** చిన్నారుల విద్యాభివృద్ధి, ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య అన్నారు. ఇల్లందు పట్టణంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు స్లేట్లు, వాటర్ బాటిళ్లు, దుస్తులను కౌన్సిలర్ దండు సారయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని అన్నారు. చిన్న వయసు నుంచే పిల్లల్లో విద్య పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, వారికి అవసరమైన విద్యా సామగ్రి, ఇతర ప్రాథమిక వస్తువులను అందించడం ద్వారా చదువుపై మరింత మక్కువ కలిగించవచ్చని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందుతున్న విద్య, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ వంటి సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వు చూడటం ఎంతో ఆనందంగా ఉంది. వారి భవిష్యత్తుకు మనం అందించే చిన్న సహాయం కూడా ఎంతో విలువైనది. పిల్లల సంక్షేమం, విద్యాభివృద్ధికి భవిష్యత్తులోనూ నా వంతు సహకారం కొనసాగిస్తా అని కౌన్సిలర్ దండు సారయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు, స్థానిక మహిళలు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం



**టేకులపల్లి, ప్రభాతవార్త:** పదవీ విరమణ పొందిన చిలకమర్రి రామకృష్ణ, బొడ్డుపల్లి బ్రహ్మచారి దంపతులను బ్రహ్మంగారి దేవాలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన ఈ కార్యక్రమం నిర్వహించారు. చిలకమర్రి రామకృష్ణ పోస్టల్ శాఖలో, బొడ్డుపల్లి బ్రహ్మచారి ఉపాధ్యాయుడిగా సేవలందించి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా వారిని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు బచ్చల పద్మాచారి మాట్లాడుతూ.. రామకృష్ణ, బ్రహ్మచారి తమ తమ వృత్తుల్లో అంకితభావంతో విధులు నిర్వర్తించి సమాజానికి సేవలందించారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సేవాభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమాజానికి సేవలందించిన వారికి ఎల్లప్పుడూ గౌరవం ఉంటుందని అన్నారు. విశ్వబ్రాహ్మణులంతా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దిగ్గట్ల వెంకటాచారి, జిల్లా నాయకులు తాళ్లూరి సత్యనారాయణ, టేకులపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు తౌడోజు బిక్షమయ్య, నోముల భాస్కరాచారి, ధర్మపురి వీరబ్రహ్మచారి, ధర్మపురి శ్రీనివాసాచారి, ఆకారవు స్వప్న, చంద్రగిరి రాధాకృష్ణ, కట్టుకోజ్వల సురేష్, ఉరిమెళ్ల యాదాచారి, గజ్జల రవీందర్, గుంతోజు కృష్ణ, మోత్కూరి రామాచారి, రాంబ్రహ్మచారి, వెనగంటి రవీందర్, గుమ్మడోజు తిరుపతి, మోత్కూరి సతీష్, తౌడోజు మణికంఠ, తౌడోజు గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**ఇల్లెందు అర్బన్,ఆగస్టు 8, ప్రభాతవార్త** :ప్రోగ్రెసివ్ అండ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్, టియుసిఐ అనుబంధం, కార్మికుల జనరల్ బాడీ సమావేశం శనివారం ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఝాన్సీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో టియుసిఐ జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో పనిచేస్తున్నటువంటి కార్మికుల బాధలు వర్ణాతీతంగాఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి పర్మినెంట్ కార్మికులకు ప్రతినెల మొదటి తారీకునే జీతాలు వేస్తున్నామని కాంట్రాక్టు కార్మికులకు కూడా ఒకటవ తారీఖు నాడు జీతాలు వేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి హామీ ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు ఎవరికీ మొదటి తారీకున పడతలేవని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్లు అయిపోయిన ప్రభుత్వం ఇంకా టెండర్లు ఖరారు చేయ లేదని అన్నారు. గత టెండర్లలో కాంట్రాక్టర్లు కార్మికులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ కొత్త టెండర్లోనైనా కార్మికులకు కనీస వేతనాలు 26,000 ఇచ్చే విధంగా ఈపీఎఫ్, కార్మికుడి ప్రభుత్వం వాటా కలిపి2 షేర్లు వెయ్యాలని రెండు వైపులా కార్మికుడికి మాత్రమే కట్ చేస్తున్నారని ఇది చట్ట వ్యతిరేకం అన్నారు. ప్రతి నెల కార్మికుల జీతాలు అందడం లేదని నెలల తరబడి పెండింగ్లో ఉంటున్నాయని కార్మికులు ఇబ్బంది పడుతున్నారని వారన్నారు. ఇప్పటికైనా కార్మికుల జీతాలు సకాలంలో అందే విధంగా ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రవి శ్రీను కృష్ణవేణి ఉమా కవిత లక్ష్మి సుజాత సునీత సైదమ్మ విజయలక్ష్మి లలిత రోహిత్ సురేష్ శ్రీనాథ్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తలసేమియా నివారణకు ఐటీసీ చేయూత

## -రూ.5 లక్షలతో 1,800 వ్యాధి నిర్ధారణ పరికరాలు



**భద్రాచలం, ఆగస్టు 8(ప్రభాతవార్త):** జిల్లాలో తలసేమియా, సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధుల నియంత్రణకు ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ మరోసారి చేయూతను దించేందుకు ముందుకొచ్చింది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి రూ.5 లక్షల వ్యయంతో 1,800 వ్యాధి నిర్ధారణ పరికరాలను అందజేస్తామని ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్ హామీ ఇచ్చారు. జిల్లాలో తలసేమియా, సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధుల ప్రభావం అధికంగా ఉందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. ఇవి వంశపారంపర్యంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే రక్తహీనత వ్యాధులని పేర్కొన్నారు. వ్యాధితో బాధపడుతున్న వారికి సుమారు ప్రతి 21 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించాల్సిన పరిస్థితి ఉంటుందని వివరించారు. వ్యాధుల నిర్ధారణ, నివారణకు గత నాలుగేళ్లుగా ఐటీసీ పీఎస్‌పీడీ సంస్థ ఏటా రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షలు వెచ్చించి అవసరమైన వ్యాధి నిర్ధారణ పరికరాలను అందించిందని రెడ్‌క్రాస్ ప్రతినిధులు తెలిపారు. దీంతో జిల్లాలోని ఎంతోమంది పేదలకు ప్రయోజనం కలిగిందన్నారు. ఈ నేపథ్యంలో 2026–27 సంవత్సరానికి మరో రూ.5 లక్షల విలువైన 1,800 వ్యాధి నిర్ధారణ పరికరాలను అందించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ డా. ఎస్.ఎల్. కాంతారావు ఐటీసీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గిరిజన సంక్షేమంతోపాటు తలసేమియా, సికిల్‌సెల్ ఎనిమియా నియంత్రణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ కూడా ఐటీసీ యాజమాన్యాన్ని కోరినట్లు తెలిపారు. ఈ విజ్ఞప్తిపై శైలేంద్రసింగ్ వెంటనే సానుకూలంగా స్పందించి పరికరాలు అందజేస్తామని హామీ ఇవ్వడంతో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గం ఆయనకు కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో పాకాల దుర్గాప్రసాద్, జి.రాజారెడ్డి, వై.సూర్యనారాయణ, బి.వెంకటరెడ్డి, వి.కామేశ్వరరావు, సిద్ధారెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.




## పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం

**టేకులపల్లి, ప్రభాతవార్త:** వికలాంగులు వితంతువులు ఒంటరి మహిళలు గీత నేత కార్మికులు ఫైలేరియా వ్యాధిగ్రస్తుల పెన్షన్ దరఖాస్తులు చేసుకోవాలని టేకులపల్లి ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి తెలిపారు అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కావాల్సిన పత్రాలు తీసుకొని సమీప పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని సూచించారు అర్హుల కుటుంబ వార్షిక ఆదాయం 1.50 లక్షల్లో పై ఉండాలని ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తుల అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలన ఉంటుందని తెలిపారు

## ఆదివాసి దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు



**భద్రాచలం, ఆగస్టు 8(ప్రభాతవార్త):** ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్ రాజ్ అధికారులను ఆదేశించారు. వీఐపీలు, గిరిజన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆదివారం గిరిజన భవన్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. అంబేద్కర్ సెంటర్, పాత మార్కెట్ సెంటర్ వద్ద మహనీయుల విగ్రహాల వద్ద జరిగే కార్యక్రమాలతో పాటు బ్రిడ్జి సెంటర్ వరకు నిర్వహించే ర్యాలీకి, గిరిజన భవన్‌లో జరిగే సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వీఐపీలు, ప్రజలకు ప్రత్యేక భోజన కౌంటర్లు, ప్రముఖులు, జిల్లా అధికారుల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆదివాసీ సంప్రదాయ పూజా కార్యక్రమాలు, ప్రముఖుల ప్రసంగాలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సజావుగా జరిగేలా ప్రత్యేకంగా అధికారులను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ఆదివాసీ సంఘాల నాయకులు, గిరిజన పెద్దలు, యువత, మహిళలు అధికారులకు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డేవిడ్ రాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏవో సున్నం రాంబాబు, టీఏ శ్రీనివాస్, ఏటీడీవో రాధమ్మ, డీఎస్ఓ ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణ, జీపీ సిబ్బంది వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ముచ్చర్ల రహదారుల పై గుంతలు పూడ్చివేత



**కామేపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త:** కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామంలో గ్రావెల్ రోడ్ల పై ఏర్పడిన గుంతలను సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ ఆధ్వర్యంలో గ్రావెల్ తో శనివారం పూడ్చి వేశా రు.సోమన బోయిన రవి ఇంటి నుండి జక్కుల లింగయ్య ఇంటి వరకు కొత్తగా గ్రావెల్ రోడ్డు ను కూడా ఏర్పాటు చేశారు.

# మెటల్ వేసి వదిలేశారు.. ప్రజాకష్టాలు పట్టవా ?

**దమ్మపేట మండలంలో**
**అరకొరగా బిటి రోడ్లు**
**ప్రభుత్వాలు మారినా...**
**మారని రహదారుల రాత!**
**గుత్తవారిగూడెం, మల్కారం,**
**మల్లారం కాలనీల్లో అసంపూర్తిగా**
**మిగిలిన రోడ్డు పనులు**
**గత బిఆరఎస్ హయాం నుండి నేటి**
**కాంగ్రెస్ పాలన వరకు వీడని నిర్లక్ష్యం**
**రాళ్లు తేలిన బాటల్లో**
**ప్రయాణికుల నరకయాతన..**
**తక్షణమే స్పందించాలని డిమాండ్**



**దమ్మపేట, ఆగస్టు 8 ప్రభాతవార్త:**

దమ్మపేట మండలంలోని పలు గ్రామాల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన రహదారి పనులు ప్రజలకు, వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా బిటి రోడ్లు పూర్తి చేయకుండా కేవలం మెటల్ వేసి వదిలేయడంతో, ఆ రాళ్ల బాటల్లో ప్రయాణించలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గత బిఆరఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ అరకొర పనులు, నేటి కాంగ్రెస్ పాలనలోనూ ముందడుగు పడకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గుత్తవారిగూడెం గ్రామంలో కొల్లు శేఖర్ ఇంటి వద్ద నుండి గొల్లగూడెం రహదారి వరకు మెటల్ వేసి పనులను మధ్యలోనే నిలిపివేశారు. అదే విధంగా మల్కారంలో కునుసోత్ లలిత కుమారి తోట దగ్గర నుండి రావుల శ్రీను ఇంటి వరకు రోడ్డును అధ్వానంగా వదిలేశారు. మల్లారం కాలనీలో కోర్టు సమీపంలోని ఆర్ అండ్ బి రోడ్డు నుండి మల్లారం కాలనీ వరకు బిటి వేయకుండా కేవలం కంకర చల్లి వదిలేశారు. మెటల్ వేసి వదిలేసిన సంబంధిత కాంట్రాక్టర్ ఎటువంటి స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మారిన పాలకులు.. తీరని కష్టాలు!**

గత బిఆరఎస్ ప్రభుత్వ హయాంలో కంకర, మెటల్ వేసి రోడ్డు పనులను పక్కన పెట్టగా, ప్రభుత్వం మారినా నేటి కాంగ్రెస్ పాలనలో కూడా ఎలాంటి పురోగతి లేకపోవడం శోచనీయం. రాళ్లపై నడవలేక పాదచారులు, ద్విచక్ర వాహనాలు జారిపడి ప్రమాదాల బారిన పడుతూ వాహనదారులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. వర్షాకాలంలో ఈ రోడ్ల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఆర్ అండ్ బి అధికారులు తక్షణమే స్పందించి అసంపూర్తిగా ఉన్న ఈ బిటి రోడ్డు పనులను పునఃప్రారంభించి, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని దమ్మపేట మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.






## 10న మండల కేంద్రాల్లో ఆందోళనలు

**దమ్మపేట రూరల్ ఆగస్టు 8 ప్రభాతవార్త :**



కార్మికులు, వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారాలు, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు సిఐటియు ఆధ్వర్యంలో 10 వ తేదీన నిర్వహించ తలపెట్టిన ఆందోళనలు విజయవంతం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని దీనివలన ప్రజల కొనుగోలు శక్తి రోజురోజుకు తగ్గిపోతుంది అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పనిచేస్తుందని, రైతు కూలీలు, చిరు వ్యాపారులు, రైతాంగ సమస్యలు కొరకు ఆగస్టు 10న జైలు మరో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కౌలూరి రామకృష్ణ, మధు, ప్రసాద్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త జైల్‌భరోను జయప్రదం చేయండి

**సంయుక్త కిసాన్ మోర్చ పిలుపు**

**అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త:**

దేశవ్యాప్తంగా చేపట్టబోయే 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా అశ్వారావుపేట మండల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. శనివారం స్థానిక మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గోకినపల్లి ప్రభాకర్ , అఖిలభారత రైతు సంఘం రాష్ట్ర నాయకులు కొక్కిరపాటి పుల్లయ్య, సిపిఐ జిల్లా సమితి సభ్యులు జి రామకృష్ణ, అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కంగాల కల్లయ్య పాల్గొని మాట్లాడారు. మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ, స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో భారతీయ రైతాంగాన్ని నిలువునా ముంచుతోందని మండిపడ్డారు. విదేశాలతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గం ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న 39 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమన్నారు. దీనివల్ల కార్మికుల హక్కులను కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టారని విమర్శించారు. పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేసి, అమలు చేయాలని ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. వాసం బుచ్చిరాజు, బి చిరంజీవి, పిట్టల అర్జున్, బాడిస లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.




## ఆదివాసీ హక్కులకై ఆగస్టు 9 ఆదివాసి దినోత్సవం జరుపుదాం

**దమ్మపేట, ఆగస్టు 8 ప్రభాతవార్త:**



ఆదివాసీ హక్కుల కోసం, పోరాటం కోసం ఆగస్ట్ 9 న ఆదివాసీ దినోత్సవంను జరుపుకుందామని ఎఐయుకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము పిలుపునిచ్చారు. శనివారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ సమాజంలో అత్యంత ముఖ్యమైన, వెనుకబడి ఉన్న జాతి ఆదివాసీలు. అడివిలో అడవి అయి, ప్రకృతిలో మమేకమై జీవిస్తున్న వారు. ఆంగ్లేయులు కాలం నుంచి వారి హక్కులపై, జీవనంపై దాడి జరుగుతుందన్నారు. ఆదివాసీ దినోత్సవం అంటే జాతర జరపడం కాదని హక్కుల కోసం నినదించడం. పోరాటానికి ప్రతిన బూనడం. పాలకులు వారి హక్కులకు పూచీ పడటం అని అన్నారు. పోడు భూములకు సంబంధించి అన్నింటికీ పట్టాలు ఇవ్వాలని, వ్యవసాయానికి సంబంధించిన అన్నీ పథకాలు వారికి వర్తింప చేయాలని, పీసా చట్టాన్ని అమలు చేయాలని, రాజ్యాంగంలోని షెడ్యూల్ 5ని అమలు చేయాలని, ఆదివాసీ ఉద్యోగాలు వారికే అందేలా చూడాలని, ఆదివాసీ ప్రాంతాలను స్వయం పాలిత ప్రాంతంగా ప్రకటించాలని, జల్, జమీన్, జంగిల్పై వారికి హక్కులు కల్పించాలని, పోడు సాగుదారులపై కేసులు ఎత్తి వేయాలని అన్నారు.

## ఉద్యమకారుడు పప్పు సుబ్బారావు అమరజీవి

**డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**

**పాల్వంచ టౌన్, ఆగష్టు 8 ప్రభాతవార్త:**



ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఎన్నో సంవత్సరాలు జరిగిన ఉద్యమంలో చురుకైన పాత్ర వహించిన ఉద్యమకారుడు పప్పు సుబ్బారావు అమరజీవి అని డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధక్ష్యులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఉద్యమనేత పప్పు సుబ్బారావు అనారోగ్యంతో ఇటీవల మరణించారు. శనివారం పాల్వంచ మున్సిపల్ 7వ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరహిల్స్ కాలనీలోని ఆయన గృహంలో దశదినకర్మ, సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుబ్బారావు నిత్యం తన మిత్రులతో కలిసి చురుకుగా పాల్గొన్నారన్నారు. ఆయన మృతి తీరని లోటు అని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం కొత్వాల తెలిపారు. కళాకారుడు సిద్దెల హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు వాసుమల్ల సుందర్ రావు, వాలపల్లి రాంబాబు, డోలి శ్రీను, బెతంశెట్టి వెంకట్, బోగిని సందీప్, సాగర్, నిమ్మల పురుషోత్తం, పుంజల ప్రసాద్, పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం

**అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 8 ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో అశ్వారావుపేటలో శనివారం అఖిలభారత ఐక్య రైతు సంఘం, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘంల ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావం కారణంగా మొలకెత్తిన పంటలు ఎండిపోతున్నందున, వ్యవసాయ సాగుదారులకు విత్తనాలను ప్రభుత్వాలు ఉచితంగా అందించాలి. రైతుల రుణాలన్నింటినీ ఒకేసారి పూర్తిగా మాఫీ చేయడంతో పాటు, కొత్తగా వడ్డీ లేని పంట




రుణాలు మంజూరు చేయాలని, సమగ్రమైన పంట బీమాను అమలు చేయడంతో పాటు, ప్రాజెక్టుల లోపాలను సవరించి ఎండిపోతున్న పంటలకు తక్షణమే సాగునీరు అందించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో గోకినపల్లి ప్రభాకర్, కంగాల కల్లయ్య, నకిరేకంటి నాగేశ్వరరావు, వాసం బుచ్చిరాజు, బాడిస లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులకు కరపత్రాలు పంపిణీ



**కల్లూరు, ఆగష్టు 08, ప్రభాతవార్త**

కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న మధ్యాహ్న భోజనం, ఆసుపత్రి కార్మికులు, మున్సిపాలిటీ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, పాఠశాల స్వీపర్లు తదితర రంగాలలో పనిచేస్తున్న కార్మికులు అందరికీ ఈనెల 23 , 24 తేదీలలో ఏ ఐ టి సి ఖమ్మం జిల్లా 17వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో మాట్లాడుతూ ఏఐటీయూసీ జిల్లా మహాసభలు మొదటిసారిగా సత్తుపల్లిలో జరుగుతున్నాయని రెండు రోజులపాటు జరిగే ఈ మహాసభలకు జిల్లా, రాష్ట్రం నుంచి 500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. సత్తుపల్లి ప్రాంతం నేడు సింగరేణి నాలుగు ఓపెన్ కాస్ట్ మైన్స్ వేలాది మంది కార్మికులు ఉద్యోగులు ఔట్సోర్సింగ్ ,కాంట్రాక్ట్ కార్మికులతో దినదిన ప్రవర్తమానంగా కొనసాగుతుంది .ఇంకా కిన్లే వాటర్, కల్లూరు గూడెం పామాయిల్ ఫ్యాక్టరీ, ప్రారంభానికి సిద్ధంగా ఉంది .మరియు బుగ్గపాడు ఫుడ్ పార్క్, పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న ఈ సమయంలో సంఘటిత అసంఘటిత రంగంలో పనిచేయుచు వేలాదిమంది కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. ఇంకా అనేక రంగాలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు గ్రామాలలో కార్మికులందరికీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమాలలో మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఒడల కృష్ణమూర్తి, వజేర్మియా, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, మల్లేష్, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పా గా సత్యావతి, కంభంపాటి వెంకటలక్ష్మి ్ర, పాఠశాల స్వీపర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు షేక్ మలేఖ ,కమలమ్మ, వివో ఎల, సంఘం అధ్యక్ష కార్యదర్శులు వేము నాగమణి, కె నీలవేణి, నగర దీపికల సంఘం నాయకులు జొన్నలగడ్డ కుమారి ,ఉబ్బన రమాదేవి, ఆసుపత్రి సంఘం నాయకులు వంశీ నాయక్ ,రమాదేవి, వారం రోజులు పాటు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.





## అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు సెప్టెంబర్ 9 వరకు పొడిగింపు

సత్తుపల్లి ఆగస్టు 8 ప్రభాతవార్త



జెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనిర్వహించబడుతున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ నందు 202627 విద్యా సంవత్సరానికి గాను బీఏ, బీకాం, బీఎస్సీ ప్రవేశాల నిమిత్తం గడువు తేదీని సెప్టెంబర్ 9 వరకు పొడిగించడం జరిగిందని కోఆర్డినేటర్ డా. చీపు పూర్ణచంద్రరావు శనివారం ఒకప్రకటనలోతెలియజేశారు. డిగ్రీలో అడ్మిషన్ పొందుటకు ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ, ఓపెన్ ఇంటర్,డిప్లొమా పాసైన విద్యార్థులు అర్హులని ఆయనఅన్నారు.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో చదవాలనుకునే ఎస్.టి కోయ, చెంచు, గోండు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్ విద్యార్థులకు ఉచిత డిగ్రీ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. రెగ్యులర్డిగ్రీచేయలేనివారు ముఖ్యంగా ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు చేసేవారు, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దూరవిద్యలో పొందిన డిగ్రీకి రెగ్యులర్ విద్యలో పొందిన డిగ్రీతో సమానమైన అవకాశాలు ఉంటాయని వివరించారు. డిగ్రీ రెండవ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు సెప్టెంబర్ 9 లోపు చెల్లించాలని తెలిపారు.మరిన్ని వివరాలకు 9491881910, 8187837058 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

## జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

పెనుబల్లి, ఆగష్టు 08, ప్రభాతవార్త



ఈ నెల 10వ తారీఖున జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు గాయం తిరుపతిరావు చెమట విశ్వనాథం పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కొత్తలంక పల్లి, సుందరయ్య కాలనీ లంకపల్లి పెరికికుంట గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోడు సాగుదారులకు, ఎస్సీ, బీసీలకు కూడా పోడుపట్టాలివ్వాలని, పోడు పట్టాలు ఉన్నవారికి కరెంటు బోర్లు ఇవ్వాలన్నారు, కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లు మరియు వాటి నిబంధనలను పూర్తిగా రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు 2025 వెనక్కు తీసుకోవాలని, విద్యుత్తు రంగం ప్రైవేటీకరణ నిలిపి వేయాలని, స్కీము వర్కర్లను కార్మికులుగా గుర్తించి, వీరికి కనీస వేతనం అమలు చేయాలని, విబిజీ రాంజీ చట్టం ని రద్దుచేసి, రోజు పనికి 700 రూపాయల కేటాయించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10వ తారీఖున పెనుబల్లి మండల కేంద్రంలో జైలు బరో కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు యొక్క కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సందర్భంగా కరపత్రాల ద్వారా గ్రూప్ మీటింగ్ ల ద్వారా ప్రచారం చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డేగ బజార్ చిలక రమణ, నాగమణి, గుడిమెట్ల బాబు, పోతన బుచ్చయ్య, రాజమ్మ, నేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మల యుగంధర్ ని కలిసిన పువ్వాడ నగర్ కాంగ్రెస్ నూతన కమిటీ.

రఘునాథపాలెం, ప్రభాతవార్త ఆగస్టు 8



మండల కేంద్రం లోని పువ్వాడ నగర్ గ్రామం లో నూతనంగా ఎన్నికైన వివిధ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, రాష్ట్రా వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరావు గారి తనయులు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ గారిని గ్రామ సర్పంచ్ షేక్ సిద్దిక్ గారి నేతృత్వం లో కలిశారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ అధ్యక్షులు గా ఎన్నికైన వడ్లకుంట శివ ను శాలువా తో తుమ్మల యుగంధర్ గారు సత్కరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంత రావు,ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు,గ్రామ ఇంచార్జ్ లు అశ్రీఫ్,కాంపాటి వెంకన్న, ఉపాధ్యక్షులు రఫీ, కార్యదర్శి రాములు, సలహాదారులు చిక్కుల్ల మల్లయ్య, మహిళా కమిటీ సభ్యులు కార్యదర్శి జరీన, చీమల నీల, లోడుగు నాగమణి,యూత్ అధ్యక్షులు పడాల రాజు, సలహాదారులు ఇస్మాయిల్,మహేష్, సైది రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అదుపుతప్పిన ఎలక్ట్రిక్ బస్సు

### తృటిలో తప్పిన పెను ప్రమాదం

### జాతీయ రహదారి పక్కకు దూసుకెళ్లిన బస్సు

### ప్రాణాలతో బయటపడ్డ 20 మంది ప్రయాణికులు

**మహాదేవపూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద హనుమకొండ నుండి కాళేశ్వరం వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు సాంకేతిక కారణాలతో జాతీయ రహదారి పక్కకు దూసుకెళ్ళింది. ఈ ఘటనలో పెను ప్రమాదం తప్పింది. బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 20 మంది ప్రయాణికులు సురక్షి తంగా బయటపడ్డారు. ప్రయాణికులతో వెళ్తున్న ఎలక్ట్రిక్ బస్సు అకస్మాత్తుగా అదుపుతప్పి జాతీయ రహదారి పక్కకు దూసుకెళ్లింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అయితే బస్సు బోల్తా పడకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రయాణికులను సురక్షి తంగా బస్సు నుంచి బయటకు తీసుకువచ్చారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణికులు, వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

## ఎమ్మార్పీఎస్ నూతన గ్రామకమిటీ ఎన్నిక

### అధ్యక్షునిగా లేతకరి అవినాష్ ఏకగ్రీవ ఎన్నిక

**మహాదేవపూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం ఎమ్మార్పీఎస్ ఎంఎస్ పి నూతన గ్రామ కమిటీని మందకృష్ణ మాదిగా ఆదేశాల మేరకు శనివారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇంచార్జ్ మడిపల్లి శ్యామ్ బాబు, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్, ఆధ్వర్యంలో హరిత హోటల్ లో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్చార్జి మడిపల్లి శ్యాం బాబు, మాట్లాడుతూ..పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సమాజంలో ప్రతి పేద కుటుంబానికి ఉపయోగపడే విధంగా ఎన్నో పోరాటాలు చేసి సమాజంలో అన్ని వర్గాల పేద వర్గాలకు ఫలాలు అందించారన్నారు. ఎమ్మార్పీఎస్ శక్తివంతలేకుండా పాటుపడడం ఎమ్మార్పీఎస్ లక్ష్యం అన్నారు. పూలే అంబేడ్కర్, జగ్జీవన్ రావు, కాల్ శ్రీరాముల వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడమే ఎమ్మార్పీఎస్ లక్ష్యమని అన్నారు. ఎమ్మార్పీఎస్ అదేవిధంగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి కాళేశ్వరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని శ్యామ్ తెలిపారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాబోవు రోజుల్లో సామాజిక ఆర్థిక అసమానతపై మరో పోరాటానికి మాదిగల సిద్ధంగా ఉండాలని, సమాజానికి మాదిగ జాతి సామాజిక ఉద్యమానికి దిక్సూచిలా ఉండేలా ఉద్యమం నిర్మాణం జరగాలని అన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా లేతకరి అవినాష్, ఉపాధ్యక్షులుగా లేతకరి భాస్కర్ , ప్రధాన కార్యదర్శిగా లేతకరి రాజశేఖర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఎంఎస్పి పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు లేతకరి రాజబాబును నియమించడం జరిగిందని పేర్కొన్నారు.

## మాచినేని కృష్ణయ్య ని పరామర్శించిన మంత్రి తుమ్మల

పెనుబల్లి, ఆగష్టు 08, ప్రభాతవార్త

హైదరాబాదులో ఒక ప్రైవేట్ హాస్పటల్లో చికిత్స పొందుతున్న తుమ్మల నాగేశ్వరరావు అత్యంత ఆప్తుడు మాచినేని కృష్ణయ్య ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామానికి చెందిన మాచినేని కృష్ణయ్య గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాస్పటల్ కి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని అక్కడ ఉన్న డాక్టర్స్ తో మంత్రి తుమ్మల మాట్లాడి మెరుగైన వైద్యాన్ని అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల తో పాటు సత్తుపల్లి నియోజకవర్గ తుమ్మల అభిమానులు పాల్గొన్నారు.



# ఇక మండలాలలోనే ప్రజావాణి

**ప్రతీ సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహణకు ఏర్పాట్లు**

**నోడల్ అధికారిగా ఎంపీడీవో**

**23 శాఖల అధికారులు హాజరుకావాల్సిందే**

నేలకొండపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ప్రభుత్వం మార్పులు తీసుకువచ్చింది. దూర ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితుల్లో వ్యయ ప్రయాసాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో



మండల స్థాయి ప్రజావాణి నిర్వహణకు ఈ నెల 4న ప్రభుత్వం జీవో విడుదల చేసింది. స్థానికంగా ఉన్న మండల పరిషత్ కార్యాలయంలో ప్రజలు అధికారులకు తమ సమస్యలు చెప్పుకుంటే సరిపోతుంది. ప్రతీ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణ నోడల్ అధికారిగా ఎంపీడీవో వ్యవహరిస్తారు. మండల స్థాయి ప్రజావాణికి 23 ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో), తహసీల్దార్, పంచాయతీ, వ్యవసాయ, హార్టికల్చర్, మత్స్య శాఖ, పశుసంవర్ధక, విద్యాశాఖ, వైద్య, మహిళా శిశు సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ, గిరిజన, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులతో పాటు డిప్యూటీ తహసీల్దార్, మండల గృహ నిర్మాణ అధికారి/అసిస్టెంట్ ఇంజనీర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, ఆర్అండ్ బి డీఈ/ఏఈ, ఇరిగేషన్ ఏఈ, గ్రౌండ్ వాటర్ ఆఫీసర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్/ బీట్ ఆఫీసర్, విద్యుత్ ఏఈ, మున్సిపల్ కమిషనర్ సమావేశాలకు తప్పని సరిగా హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మండలాలలో జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జూమ్ ద్వారా పర్యవేక్షించనున్నారు.

# సహాయం చేస్తానంటూ దివ్యాంగుడు నుంచి డబ్బులు చోరీ..

!నేలకొండపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త: నేను దివ్యాంగులకు సహాయం చేసేందుకు తిరుగుతున్నాను, మీ దగ్గర ఉన్న డబ్బులు కంటే అధికంగా ఇస్తాను అంటూ ఓ గుర్తు తెలియని ఆగంతకుడు దివ్యాంగుడిని మాయ మాటలతో నమ్మించి సినిమా పక్కీలో డబ్బులు గుంజుకుని పరారైనా ఘటన శనివారం నేలకొండపల్లిలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షిగా ఉన్న మరో దివ్యాంగుడు కొరివి వీరయ్య తెలిపిన ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నేలకొండపల్లి మండల కేంద్రంలో దివ్యాంగుడు స్కూటీలో పెట్రోల్ బంక్ వద్ద ఫోన్ మాట్లాడుతుండగా మాస్క్ ధరించిన ఓ గుర్తు తెలియని ఆగంతకుడు పల్సర్ బైక్ పై దగ్గరకు వచ్చి దివ్యాంగులకు సహాయం చేస్తానని చెప్పారు. అయితే, మీ దగ్గర డబ్బులు ఎంత ఉన్నాయో వాటికి మించి అధనంగా సహాయం చేయటం నా అలవాటు అని మాయమాటలతో నమ్మ పలకడంతో దివ్యాంగుడు నమ్మాడు. తన జేబులో ఉన్న రూ.15 వేలు నగదును తీస్తుండగా తానే లెక్కిస్తానని చెప్పి బలవంతంగా గుంజుకుని అక్కడ నుంచి ద్విచక్ర వాహనం పై పారిపోయాడు. దీంతో బాధిత దివ్యాంగుడుతో పాటు, చెన్నారంకు చెందిన మరో దివ్యాంగుడు వీరయ్య లు వారి వాహనాల పై వెంబడించారు. కానీ అప్పటికే బైక్ పై సదరు ఆగంతకుడు వేగంగా పరారైయ్యాడు. దీంతో బాధిత దివ్యాంగుడు బోరున విలపించాడు. బైక్ పై నెంబర్ ప్లేట్ లేకుండా మాస్క్ లు ధరించి తిరుగుతున్నాడని దివ్యాంగుడు పేర్కొన్నారు. ఆ పరిసర ప్రాంతాలలో సీసీ పుటేజీ ఆధారంగా మోసం చేసి ఉడయించిన గుర్తు తెలియని ఆగంతకుడిని పోలీసులు పట్టుకోవాలని పలువురు దివ్యాంగులు కోరుతున్నారు. అదే విధంగా నెంబర్ ప్లేట్ వాహనాల ను సీజ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు చెబుతున్నారు.

# పిండిప్రోలులో జరిగిన హత్యా ఉదంతాన్ని ఛేదించిన పోలీసులు.

తిరుమలాయపాలెం ప్రభాత వార్త ఆగష్టు 8 పిండిప్రోలు గ్రామంలో వరుస దొంగతనాలతో అదలెత్తిస్తు పిండిప్రోలు గ్రామంలో జూలై 18 వ తారీకున అర్ధరాత్రి చెన్న. సుగుణమ్మ దారుణ హత్యకు గురైన సంఘటన తెలిసిందే . అప్పటినుండి హంతకుడి కోరకు పోలీసులు, క్రైమ్ బ్రాంచ్ పోలీసులు , స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గత 20 రోజుల నుండి నిర్విరామంగా కష్టపడి హంతకుడు వాడుతున్న చరవాణి ద్వారా ఆచూకీని తెలుసుకొని నిందితుడిని పట్టుకొని పోలీస్ కస్టడిలోకి తీసుకున్నారు . హత్యకు గురైన చెన్న సుగుణమ్మ నివాసం ఉంటున్న ఇంటి ప్రక్కనే అదే గ్రామానికి చెందిన ఐతబోయిన ప్రశాంత 27 ఒక సంవత్సరం నుండి చికెన్ షాపు నిర్వహిస్తూ ఉన్నాడు సుగుణమ్మ రోజువారీగా పాఠశాలలో మిడ్డి మిల్స్ వండిపెట్టి వచ్చే క్రమంలో ఆమె మెడలో ఉన్న బంగారు నగలను చూసి ప్లాన్ ప్రకారం గా 18 వ తారీకు అర్ధరాత్రి సుగుణమ్మ, ఆమె భర్త నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై ఉన్న బంగారు గొలుసులను లాక్కొని వెళ్లే క్రమంలో ఆమె ప్రతిఘటించగా ప్రశాంత్ బలమైన ఆయుధంతో తలపై కొట్టగా సుగుణమ్మ అక్కడి కక్కడే చనిపోయింది. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు అతని చరవాణి ద్వారా కొన్ని సంఘటనలను తెలుసుకొని నిందితుడిని పట్టుకొని పోలీస్ కస్టడికి తీసుకువెళ్లారని తెలిపింది . ఈ ఘటన ఇతను ఒక్కడే చేశాడా లేక ఇతని వెనక ఇంకెవరైనా ఉన్నారా అనే కోణంలో కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సెమినార్

అశ్వాపురం,ప్రభాతవార్త, ఆగస్టు 08: అశ్వాపురం మండలం లోని మిట్టగూడెం గ్రామం గురుకుల డిగ్రీ కళాశాల నందు ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా అశ్వాపురం తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసుల ఉనికికి చట్టాలకు ప్రమాదం అనే అంశంపై తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి పాయం నరసింహారావు అధ్యక్షతన సెమినార్ జరిగింది. ఈ సెమినార్లో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆదివాసీల అస్తిత్వాన్ని మరియు కొన్ని ఆదివాసి తెగలు కోల్పోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆదివాసుల చట్టాలను అమలు చేయడంలో కేంద్ర



రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనాయని, ఏజెన్సీ ప్రాంతంలో1/70 చట్టం కాగితాలకే పరిమితం తప్ప అమలు శూన్యమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేకించి రిజర్వేషన్ కల్పిస్తూ జీఓ నెంబర్ 03 ను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని గత ప్రభుత్వాలు తీసుకొస్తే ఆ జీవో కు వ్యతిరేకంగా కొంతమంది గిరిజన నేతలు కోర్టులో వేసిన పిటిషన్ కు కౌంటర్ గా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అడ్వకేట్లన్ ని నియమించి ప్రభుత్వం వైపున ఆ జీవోను ఎందుకు తీసుకొచ్చాము ఇంకా ఎందుకు అవసరమో అనే వాదనలు వినిపించిన కారణంగా ఈరోజు జీవో నెంబర్ 3 ని కోల్పోయామని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వంఆర్డినేషన్ ద్వారా జీఓ నెంబర్ 03 ని తీసుకొని వచ్చి ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు కారం పుల్లయ్య మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవం విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘం నాయకులు ఉకే. సాయికుమార్ ఏనిక సీతయ్య. కొమరం ఉమేష్ చంద తదితరులు పాల్గొన్నారు




## సమస్య పరిష్కారం కోసం ఆరు నెలల క్రితం వినతి స్పందించని ఆర్అండ్‌బీ అధికారులు

అశ్వాపురం,ప్రభాతవార్త, ఆగస్టు 08:



అశ్వాపురం మండలంలోని నెల్లిపాక పంచాయతీ పరిధిలో ప్రజలు,విద్యార్థుల భద్రత కోసం ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని,పాఠశాలల ముందు వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆరు నెలల క్రితమే ఆర్అండ్‌బీ అధికారులకు లిఖితపూర్వకంగా లేఖ అందజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెల్లిపాక పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారులపై పలు ప్రమాదకర మలుపులు ఉన్నప్పటికీ వాహనదారులను అప్రమత్తం చేసే హెచ్చరిక బోర్డులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా పాఠశాలల ముందు వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తుండటంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను స్థానిక సర్పంచ్ ముంద్రు రామకృష్ణ ఆధ్వర్యంలో ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆరు నెలలు గడిచినా కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు నిర్మించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా పాఠశాలల పరిసర ప్రాంతాల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే నెల్లిపాక పంచాయతీ పరిధిలోని ప్రమాదకర మలుపులు, పాఠశాలల వద్ద క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి హెచ్చరిక బోర్డులు, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు.

## నాగులు కు ఘన నివాళి



అశ్వాపురం,ప్రభాతవార్త, ఆగస్టు 08: మొండి కుంట గ్రామ పంచాయతీ లో బీసీ కాలనీ వాస్తవ్యులు దేరంగుల నాగులు అకాల మరణం చెందటంతో వారి స్వగృహం నందు పార్థీవ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన బి ఆర్ ఎస్ నాయకులు,నిరుపేద కుటుంబం కావటంతో అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం మొండి కుంట సర్పంచ్ మడి సంధ్య 5000 రూపాయలను, ఇంటిలిజెన్స్ మాజీ ఎస్సై కాసరబాద శ్రీనివాస్ 3000 రూపాయలను వారి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చేమల్ల శివారెడ్డి, నాయకులు జాలే రామకృష్ణారెడ్డి, మడి మల్లారెడ్డి, దేరంగుల వెంకులు, దేరంగుల వెంకన్న, నగునూరు దుర్గా ప్రసాద్, మడి అశోక్ రెడ్డి, చేను శ్రీహరి తదితరులు పాల్గొన్నారు

# నేత్రపర్వంగా కల్యాణ ఘట్టం..

## భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తజనం

**భద్రాచలం కల్చరల్, ఆగస్టు 8 (ప్రభాతవార్త):**

సీతారాముల దివ్య కల్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య మిథిల స్టేడియంలో నిర్వహించారు. వరుస సెలవులు రావడంతో భద్రాచలం చేరుకున్న భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని దివ్య దంపతుల ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తుల సందడితో, వేదమంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

**-వైదిక సంప్రదాయ పద్ధతిలో కల్యాణం:**

కల్యాణ మహోత్సవానికి ముందు ఆలయ అర్చకులు, వైదిక సిబ్బంది మూలవరులకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైదిక సంప్రదాయ పద్ధతిలో సీతారామచంద్రస్వామివారి దివ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన కల్యాణ ఘట్టం భక్తులను



భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. స్వామివారి కల్యాణాన్ని తిలకించిన భక్తులు జైశ్రీరామ్ నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. దివ్య దంపతుల కల్యాణాన్ని దర్శించిన అనంతరం భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు. స్వామివారి కృప తమ కుటుంబాలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షి ంచారు.

**-భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ**

కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేపట్టి కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించారు. భక్తులకు కల్యాణ లడ్డూలతో పాటు పులిహోర



ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వైదిక సిబ్బంది, ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సీతారాముల దివ్య కల్యాణాన్ని తిలకించిన భక్తులు ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. భద్రాద్రి క్షేత్రంలో జరిగిన ఈ కల్యాణ మహోత్సవం భక్తులకు మరపురాని అనుభూతిని మిగిల్చింది.



# కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ నిర్మాణాత్మక చర్చలు

## త్వరితగతిన పరిష్కరిస్తామన్న జీఎం

**సత్తుపల్లి ఆగస్టు 8 ప్రభాతవార్త**

సత్తుపల్లి సింగరేణి ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్నసమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని గుర్తింపు కార్మిక సంఘంఏఐటీయూసీ సత్తుపల్లికార్యదర్శిసముద్రాల సుధాకర్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ నాయకులు జీఎం సరికొండ వెంకటాచారితో జీఎం స్థాయి నిర్మాణాత్మక సమావేశం శనివారం సాయంత్రం జనరల్ మేనేజర్ కార్యాలయం లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియాలోని పలు సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లి, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు. ఈ సందర్భంగా సముద్రాల సుధాకర్ మాట్లాడుతూ. 2026 ఫిబ్రవరి 1న విధులు నిర్వహించిన 61 మంది ఈపీ ఆపరేటర్లకురావాల్సి న వేతనాలుఇప్పటికీ చెల్లించలేదని, వెంటనే బకాయి వేతనాలను చెల్లించాలని కోరారు. అదేవిధంగా 2025 సెప్టెంబర్ 25 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈపీ ఆపరేటర్లఅప్‌గ్రేడ్‌పదోన్నతులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో పీవీఎన్ఆర్ కాలనీలోదోమలనివారణకు యాంటీమస్కిటోమందులు, ద్రావణాలను పిచికారీ చేసి వ్యాధులవ్యాప్తినిఅరికట్టాలని కోరారు.

గత మూడు నెలలుగా కాలనీలోని నీటి ట్యాంకులు శుభ్రం చేయకపోవడంతో వెంటనే వాటిని శుభ్రం చేయాలని సుధాకర్ తెలిపారు. క్వారీ కార్యకలాపాలను పర్యవేక్షించే హెచ్ఓఎం, ఓఎం, ఎంఎస్ విభాగాల సూపర్‌వైజర్ సిబ్బందికి వర్షాకాలంలో విధులు నిర్వహించేందుకు గొడుగులు, రెయిన్‌కోట్లు అందించాలనికోరారు. జేవీఆర్ సీఎచ్‌పీకి కార్మికుల రవాణా విషయంలోనూ చర్యలు తీసుకోవాలని సుధాకర్ కోరారు.

వర్క్ ఆర్డర్ ప్రకారం సిలో నుంచి సీఎర్‌సీ ప్రాంతానికి, తిరిగి సీఎర్‌సీ నుంచి సిలోకు మాత్రమేవినియోగించాల్సి న మినీ బస్సును సత్తుపల్లి టీవీఆర్ టవర్స్ నుంచి సిలో వరకు కార్మికుల రవాణాకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. జేవీఆర్ సీఎచ్‌పీకి కార్మికుల రవాణా కోసం క్యాంపర్లు, 3టీ ఐచర్ వాహనాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీఎర్‌సీ, సిలో స్టీల్ బంకర్ ప్రాంతాల్లో దుమ్ము నియంత్రణ చర్యలను మరింత పటిష్టంగా చేపట్టాలనికోరారు. సత్తుపల్లి క్వార్టర్స్ విషయంలో గతంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్నందున యాజమాన్యం కార్మికులకు 8 శాతం హెచ్ఆర్ఏ చెల్లించిందని, ప్రస్తుతం పంచాయతీ పరిధిలోకి వెళ్లిందనే కారణంతో గతంలో చెల్లించిన 8 శాతం హెచ్ఆర్ఏను కార్మికుల నుంచి రికవరీ చేయడం సరైన పద్ధతి కాదని సుధాకర్ అన్నారు. ఈ అంశంపై గతంలో కూడా యాజమాన్యానికి వినతిపత్రాలు సమర్పించామని, ఇప్పటికైనా కార్మికుల నుంచి హెచ్ఆర్ఏ రికవరీని నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా సత్తుపల్లి ఏరియాలో ప్రస్తుతం 27 మంది మాత్రమే పర్మినెంట్ సెక్యూరిటీ గార్డులు ఉన్నారని, భద్రతా అవసరాలకు అనుగుణంగా వారి సంఖ్యను పెంచాలని, కొత్త సెక్యూరిటీ గార్డులను నియమించాలని కోరారు. కార్మికుల సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా యాజమాన్యం నిర్ణీత సమయంలోపరిష్కరించాలని, కార్మికుల హక్కులు, సంక్షేమం విషయంలో సానుకూలంగా వ్యవహరించాలని సుధాకం కోరారు. కార్మికుల సమస్యలను ఏఐటీయూసీ నాయకులు జీఎం వెంకటాచారి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ స్ట్రక్చర్ కమిటీ సభ్యులు దార భీమయ్య, కిషోర్ తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణం పెంచాలి




## నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం, ఆగస్టు 8 ప్రభాతవార్త**

వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని, తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే కొత్తగూడెం నియోజకవర్గంలో మొత్తం 209 చెరువులకు గాను 13 చెరువులు 0-25 శాతం, 129 చెరువులు 25-50 శాతం, 72 చెరువులు 50-75 శాతం, 6 చెరువులు 75-100 శాతం నీటితో నిండగా, 2 చెరువులు పూర్తి స్థాయిలో నిండి మిగులు నీటితో ఉన్నాయి. అశ్వారావుపేట నియోజకవర్గంలో 759 చెరువులకు గాను 271 చెరువులు 0-25 శాతం, 273 చెరువులు 25-50 శాతం, 76 చెరువులు 50-75 శాతం, 66 చెరువులు 75-100 శాతం నీటితో నిండగా, 23 చెరువులు పూర్తి స్థాయిలో నిండి మిగులు నీటితో ఉన్నాయి. ఇల్లందు నియోజకవర్గంలో 241 చెరువులకు గాను 132 చెరువులు 0-25 శాతం, 96 చెరువులు 25-50 శాతం, 7 చెరువులు 50-75 శాతం, ఒక చెరువు 75-100 శాతం నీటితో నిండగా, 5 చెరువులు పూర్తి స్థాయిలో నిండి మిగులు నీటితో ఉన్నాయి. పినపాక నియోజకవర్గంలో 802 చెరువులకు గాను 94 చెరువులు 0-25 శాతం, 315 చెరువులు 25-50 శాతం, 313 చెరువులు 50-75 శాతం, 79 చెరువులు 75-100 శాతం నీటితో నిండగా, ఒక చెరువు పూర్తి స్థాయిలో నిండి మిగులు నీటితో ఉంది. భద్రాచలం నియోజకవర్గంలో 349 చెరువులకు గాను 26 చెరువులు 0-25 శాతం, 150 చెరువులు 25-50 శాతం, 124 చెరువులు 50-75 శాతం, 49 చెరువులు 75-100 శాతం నీటితో నిండాయి. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా జిల్లాలో పంటల సాగు ప్రణాళికను అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. సీజనల్ యాక్షన్ ప్లాన్‌లోని 4,86,048 ఎకరాల లక్ష్యానికి గాను 4,21,367 ఎకరాల్లో సాగు పూర్తై 86.69 శాతం సాధన నమోదైంది. ఇందులో పత్తి లక్ష్యం 2,19,000 ఎకరాలు కాగా 2,19,000 ఎకరాల్లో సాగై 100 శాతం సాధించింది. వరి లక్ష్యం 31,500 ఎకరాలు కాగా 70,652 ఎకరాల్లో సాగై 224.29 శాతం నమోదైంది. మొక్కజొన్న లక్ష్యం 1,08,500 ఎకరాలు కాగా 75,775 ఎకరాల్లో 69.84 శాతం, పెసర లక్ష్యం 12,500 ఎకరాలు కాగా 6,620 ఎకరాల్లో 52.96 శాతం, కంది లక్ష్యం 22,530 ఎకరాలు కాగా 2,916.23 ఎకరాల్లో 12.94 శాతం, మినుము లక్ష్యం 12,100 ఎకరాలు కాగా 324 ఎకరాల్లో 2.68 శాతం సాగైంది. జొన్న 2,000 ఎకరాల లక్ష్యానికి ఇప్పటివరకు సాగు నమోదు కాలేదు. ఆయిల్ పామ్ లక్ష్యం 14,500 ఎకరాలు కాగా 3,516 ఎకరాల్లో 24.25 శాతం, సూర్యకాంతి లక్ష్యం 200 ఎకరాలు కాగా ఇప్పటివరకు సాగు లేదు. కూరగాయల లక్ష్యం 3,000 ఎకరాలు కాగా 680 ఎకరాల్లో 22.67 శాతం, ఇతర పంటల లక్ష్యం 60,218 ఎకరాలు కాగా 41,884 ఎకరాల్లో 69.55 శాతం సాగు నమోదైంది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ... వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగం అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని సూచిం చారు. ఆయిల్‌పామ్, కూరగాయలు, పెసర, మినుము, కంది వంటి పంటలను ప్రాంతా నుసారం సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశం లో భద్రా చలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, ఇరిగేషన్ ఎస్సీ శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధి కారి బాబురావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, సిపిఓ సునీత, మిషన్ భగీరథ ఈఈ లు నలిని, తిరుమలేష్, నీటిపారుదల శాఖ ఈ ఈ లు, డీఈలు వ్యవసాయ శాఖ ఏడీలు, ఏవోలు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.